మెయిన్
టీ-మీడియా
సామాజికం.. ప్రజల పక్షం...
www.tmedia.net.in
సంపుటి : 8
సంచిక : 382
పేజీలు : 4
మంగళవారం-07
జులై, 2026
GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in
ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

అంతర్జాతీయ స్థాయిలో ఫ్యూచర్ సిటీ అటవీ భూములు

బ్రిడ్జిలపై పర్యాటకుల కోసం ఏర్పాట్లు కు ఆదేశాలు

- పర్యాటకశాఖపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

టీ మీడియా,జూలై6,హైదరాబాద్ బ్యూరో:

రాష్ట్రంలో తలపెట్టిన పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించి నిర్దేశించుకున్న పనులను వేగవంతం చేయడానికి పర్యాటక శాఖపై ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియా పరిధిలో ఉన్న అటవీ శాఖ భూములను పర్యాటక శాఖతో కలిసి ఎకో టూరిజాన్ని అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో జరిగిన ఈ సమావేశంలో సీఎం సలహాదారు కె. రామకృష్ణా రావు , ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ గారు, పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్ గారితో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీ పరిధిలోని అటవీ భూముల్లో అంతర్జాతీయ స్థాయిలో పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి గారు చెప్పారు. గుర్రంగూడ ఎకో పార్క్ తరహాలో నగరంలో ఎకో పార్కులుగా తీర్చిదిద్దాలని సూచించారు. నగరంలోని పర్యాటక ప్రాంతాలను మరింతగా తీర్చిదిద్దాలని, తారామతి బారాదరి మరింత ఆకర్షణీయంగా అభివృద్ధి చేయాలని చెప్పారు. దుర్గం చెరువును పూర్తి స్థాయి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని తెలిపారు. మంజీరా, దిల్‌కుషా అతిథి గృహాలను అధునికీకరించాలని ఆదేశించారు.

టూరిజం హబ్ డెవలప్మెంట్ పథకం కింద వికారాబాద్‌ను అభివృద్ధి చేయాలని, ప్రధానంగా వికారాబాద్‌లోని శ్రీ వీరభద్రస్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేయాలని చెప్పారు. యాదగిరిగుట్ట తరహాలో దేవస్థానానికి పాలక మండలిని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. క్యూర్ పరిధిలో అర్బన్ ఫారెస్ట్ తరహాలో ఎకో టూరిజం ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలని, అందుకోసం ప్రత్యేక అధికారులను నియమించి పనులను ముమ్మరం చేయాలని చెప్పారు. నగరంలో పురానాపూల్ వంటి వారసత్వ సంపదగా నిలిచిన బ్రిడ్జిలను అభివృద్ధి చేసి పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దాలని, అందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని ఆదేశించారు. అభివృద్ధి చేసిన తర్వాత అవసరమైతే ట్రాఫిక్‌ను మరో మార్గం నుంచి మళ్లించి పర్యాటకులకు అవకాశం కల్పించాలని సూచించారు. పర్యాటక రంగంలో పెట్టుబడులకు సంబంధించి అధికారులను ఆరా తీసిన ముఖ్యమంత్రి గారు వచ్చే డిసెంబర్‌లో నిర్వహించే గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌పై కసరత్తును ప్రారంభించాలని చెప్పారు. ఈ సమ్మిట్ కోసం వివిధ శాఖల మధ్య సమన్వయం కోసం ఉన్నతస్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలని అధికారులకు తెలిపారు.

కరూర్ తొక్కిసలాట కేసులో సుప్రీంకోర్టులో 'డీఎంకే' పిటిషన్

టి మీడియా, జూలై 7, ఢిల్లీ బ్యూరో :

తమిళనాడు రాజకీయాల్లో సంచలనం సృష్టించిన కరూర్ తొక్కిసలాట దుర్ఘటనకు సంబంధించి దేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో మరో కీలక పిటిషన్ దాఖలైంది. ఈ కేసులో తాము కూడా ఒక పక్షంగా చేరతామంటూ ప్రతిపక్ష డీఎంకేపార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ, మాజీ ఎంపీ ఆర్ఎస్ భారతి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న తమిళగ వెట్రి కజగం ప్రభుత్వంలోని మంత్రులు, కీలక నేతలు ఈ కేసులోని కీలక సాక్షులను ప్రభావితం చేసేలా వ్యవహరిస్తున్నారని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ పిటిషన్‌ను అత్యవసరంగా విచారించేందుకు అంగీకరించిన సుప్రీంకోర్టు, దీనిపై మంగళవారం విచారణ చేపడతామని స్పష్టం చేసింది.

డీఎంకే పిటిషన్‌లోని ప్రధాన ఆరోపణలు ఇవే

గత ఏడాది సెప్టెంబర్ 27, 2025న నటుడు, ప్రస్తుత తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ ఎన్నికల ప్రచార ర్యాలీలో జరిగిన తొక్కిసలాటలో 41 మంది మరణించిన సంగతి తెలిసిందే. ఈ విషాదంపై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రస్తుతం కేంద్ర దర్యాప్తు సంస్థ విచారణ జరుపుతోంది. ఈ నేపథ్యంలో డీఎంకే తన పిటిషన్‌లో పలు కీలక అంశాలను లేవనెత్తింది. ఈ కేసులో బాధితుల కుటుంబాలే ప్రధాన సాక్షులు కాగా, వారికి ప్రభుత్వ ఉద్యోగాలు, ఇతర ఆర్థిక ప్రయోజనాలు కల్పిస్తామని అధికార పక్షం ప్రకటించడం వెనుక దర్యాప్తును ప్రభావితం చేసే వ్యూహం ఉందని డీఎంకే ఆరోపించింది. ఈ ప్రమాదం ఇంకా సీబీఐ దర్యాప్తులోనే ఉన్నప్పటికీ.. అధికార పార్టీ మంత్రులు, నేతలు బహిరంగంగా ప్రకటనలు చేస్తూ పాత డీఎంకే ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, దీనిపై సుప్రీంకోర్టు నియంత్రణలు విధించాలని కోరారు.

సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సీబీఐ దర్యాప్తు

ఈ తొక్కిసలాట ఉదంతం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించడంతో, గత ఏడాది అక్టోబర్ 2025 లోనే సుప్రీంకోర్టు ఈ కేసు దర్యాప్తును రాష్ట్ర పోలీసుల నుంచి సీబీఐకి బదిలీ చేసింది. కేవలం బదిలీ చేయడమే కాకుండా, దర్యాప్తు నిష్పక్షపాతంగా సాగాలనే ఉద్దేశంతో సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ అజయ్ రస్తోగి నేతృత్వంలో ఒక ప్రత్యేక పర్యవేక్షక కమిటీని కూడా ఏర్పాటు చేసింది. తాజాగా రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలు మారడం, బాధితులకు ఉద్యోగాల భరోసా ఇవ్వడం వంటి పరిణామాల మధ్య డీఎంకే దాఖలు చేసిన ఈ పిటిషన్ తీవ్ర ప్రాధాన్యత సంతరించుకుంది. తమిళనాడులో బై-ఎలక్షన్స్ సమీపిస్తున్న తరుణంలో, ముఖ్యమంత్రి విజయ్ బాధితుల కుటుంబాలను కలవడానికి సిద్ధమవుతున్న తరుణంలోనే ఈ న్యాయపోరాటం తెరపైకి రావడం రాజకీయంగా పెను దుమారం రేపుతోంది. మంగళవారం జరగబోయే సుప్రీంకోర్టు విచారణలో ఎలాంటి ఆదేశాలు రానున్నాయనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

గిరిజన ప్రాంతాల్లో అన్న క్యాంటీన్లు

- మారుమూల ప్రాంతాల్లో సెల్ టవర్లు
- రియల్‌టైమ్ గవర్నెన్స్ పై సీఎం చంద్రబాబు సమీక్ష

టి మీడియా, జూలై 7, అమరావతి బ్యూరో :

ప్రజా సమస్యలు, ఇబ్బందులపై కేంద్రం నుంచి రియల్ టైమ్‌లోనే స్పందించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రియల్ టైమ్ గవర్నెన్సు కేంద్రం నుంచి రియల్ టైమ్‌లోనే ప్రజల సమస్యలు, ఇబ్బందులపై రెస్పాన్స్ అందాలని దిశానిర్దేశం చేశారు. వేగంగా స్పందించగలిగితేనే పౌరులకు మెరుగైన సేవల్ని అందించగలుగుతామని స్పష్టం చేశారు. సీఎస్ ఆధ్వర్యంలో మల్టీ డిపార్ట్మెంట్ కోఆర్డినేషన్ సమావేశం జరగాలన్నారు. విశాఖ సముద్రం తీరంలో బోటు మునిగి మత్స్యకారులు గల్లంతైన ఘటనలో తక్షణ స్పందనగా ఏఏ విభాగాలు ఎలా స్పందించాయన్నదే కీలకమని అన్నారు. ఆర్టీజీఎస్ కేంద్రం 24 గంటలూ ప్రజలకు సేవలందించేలా చర్యలు చేపట్టాలని సీఎం నిర్దేశించారు. ఐదు రోజుల జిల్లాల పర్యటన అనంతరం అమరావతికి చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పురపాలక, పంచాయతీరాజ్, హోం, ఎక్సైజ్ తదితర శాఖల ద్వారా అందిస్తున్న ప్రభుత్వ సేవలపై సమావేశంలో చర్చించారు. ఏఐ మెథడాలజీ ద్వారా చిత్తూరు జిల్లాలో సంతృప్తి స్థాయి నమోదు చేస్తున్నామని అన్నారు. అధికారులు క్షేత్రస్థాయి పర్యటనల వల్ల ప్రజాభిప్రాయం నేరుగా తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. నియోజకవర్గస్థాయిలో లాస్ట్ మైల్ గవర్నెన్స్ ప్రజలకు అందాలన్నారు.

గిరిజన ప్రాంతాల్లో అన్నా క్యాంటీన్లు

రాష్ట్ర అభివృద్ధిలో ప్రజాపాలనలో పొలిటికల్ మేనేజ్మెంట్-బ్యూరోక్రటిక్ యాక్షన్ సమపాళ్లలో ఉండాలని సీఎం చంద్రబాబు తెలిపారు. పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. వివిధ కేటగిరీలు, శాఖలకు చెందిన పీజీఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి ఓ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఫలితాలు కనిపించేలా కలెక్టర్లు, ఉన్నతాధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో మహిళలపై నేరాలు గణనీయంగా తగ్గాలని, గంజాయి ముఠాలను పూర్తిగా నియంత్రించాలన్నారు. గంజాయి నిర్మూలనపై తీసుకుంటున్న చర్యలపై సమాచారాన్ని ప్రజల్లోకి వెళ్లేలా చూడాలని చంద్రబాబు నిర్దేశించారు. కేంద్రం కూడా డ్రగ్ ఫ్రీ కంట్రీగా భారత్‌ను తయారుచేసేలా కార్యాచరణ చేపట్టిందని దానికి అనుగుణంగానే లక్ష్యాలను నిర్దేశించుకోవాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాల ద్వారా ఎలాంటి ఫలితాలు సాధిస్తున్నామో అన్న అంశాన్ని కూడా ఎప్పటికప్పుడు విశ్లేషించాలని సీఎం అధికారులకు సూచించారు.

ప్రతీ అంశంలోనూ పాడుపు మంత్రం

క్షేత్రస్థాయిలో తాగునీరు, వ్యర్థాల సేకరణకు స్వచ్ఛ రథాలు, ఇంటింటికీ చెత్త సేకరణ లాంటి అంశాల్లో నిర్దిష్టమైన ఎస్ఓపీ జారీ చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పేరుకున్న 23 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను మూడు నెలల్లోగా తొలగించాలని దీనిపై ప్రజాప్రతినిధులు కూడా శ్రద్ధ పెట్టాలని సూచించారు. జీరో వేస్ట్ మున్సిపల్ ప్రాంతాలు మన లక్ష్యం కావాలని ముఖ్యమంత్రి అన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, పీజీఆర్ఎస్ ద్వారా వస్తున్న దరఖాస్తులను ఆర్థిక, ఆర్థికేతర కేటగిరీలుగా విభజించి పరిష్కారం చూపాలని సీఎం స్పష్టం చేశారు. ఈ విషయంలో కలెక్టర్లు అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. వివిధ సమస్యల్ని ఎదుర్కొనేలా ఇతర ప్రాంతాల్లో అనుసరిస్తున్న ఉత్తమ విధానాలను అనుసరించటంతో పాటు ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలన్నారు. ప్రతీ అంశంలోనూ పొదుపు మంత్రం పాటించాలని సీఎం నిర్దేశించారు. నెలరోజుల్లోగా అన్ని ప్రభుత్వ శాఖలూ అవేర్ 2.0 ద్వారా ఏమేరకు ఫలితాలు వచ్చాయో విశ్లేషించాలని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కమ్యూనికేషన్ నెట్వర్క్ కనెక్టివిటీ కోసం మారుమూల ప్రాంతాల్లో టవర్లను ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ చేపట్టాలన్నారు. ఆపరేటర్లను సంప్రదించి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమీక్షకు మంత్రి కొలుసు పార్థసారథి, సీఎస్ సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, పురపాలక, ఎక్సైజ్, పోలీసు ఉన్నతాధికారులు హాజరయ్యారు.

రన్నింగ్‌లో ఊడిపోయిన స్కూల్ బస్సు టైర్లు

- 30 మంది విద్యార్థులు సురక్షితం

టీ మీడియా జులై 6, పులివెందుల:

కడప జిల్లా పులివెందులలో ప్రైవేట్ స్కూల్ బస్సుకు తృటిలో పెను ప్రమాదం తప్పింది. మార్కెట్ యార్డ్ సమీపంలో "న్యూ వికాస్" ప్రైవేట్ బస్సు వెనుక భాగంలోని రెండు టైర్లు ఒక్కసారిగా ఊడిపోయాయి. దీంతో బస్సు అదుపు తప్పిన పరిస్థితి ఏర్పడింది. ఆ సమయంలో బస్సులో సుమారు 30 మంది విద్యార్థులు ఉన్నట్లు సమాచారం. అదృష్టవశాత్తూ విద్యార్థులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో తల్లిదండ్రులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఈ ఘటన తీవ్ర భయాందోళనకు గురి చేసింది.

ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులు

స్కూల్ బస్సుల ఫిట్‌నెస్, నిర్వహణపై తగిన పర్యవేక్షణ లేకపోవడమే ఇలాంటి ప్రమాదాలకు కారణమవుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని, విద్యార్థుల భద్రత విషయంలో నిర్లక్ష్యం తగదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల ప్రాణాలకు ముప్పు కలిగించే విధంగా ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులు రోడ్లపై తిరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. తనిఖీలు తప్పనిసరి: అలాగే జిల్లాలోని అన్ని ప్రైవేట్ స్కూల్ బస్సులపై ప్రత్యేక ఫిట్‌నెస్ తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, ప్రమాదానికి గల అసలు కారణం, అలాగే బస్సు ఫిట్‌నెస్ పరిస్థితిపై అధికారుల నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. మెకానికల్ కండిషన్: సాధారణంగా స్కూల్? బస్సులకు గానీ మరే ఇతరవాటికైనా బ్రేకులు, స్టీరింగ్, మరియు టైర్ల పరిస్థితి బాగుండాలి. రన్నింగ్‌లో ఉండగా టైర్లు ఊడిపోవడం వంటి ప్రమాదాలు జరగకుండా నిరంతరం తనిఖీ చేయాలి.

తెలంగాణలో ఒకే రాష్ట్రం ఒకే పన్ను విధానం

- బస్ ట్యాక్స్ పాలసీలో కీలక మార్పులు!

టి మీడియా, జూలై 6,హైదరాబాద్ బ్యూరో :

తెలంగాణ రాష్ట్రంలో కాంట్రాక్ట్ క్యారేజ్ బస్సుల ట్యాక్స్ విధానంలో కీలక మార్పులకు రవాణాశాఖ రంగం సిద్ధం చేస్తోంది. ప్రస్తుతం అమల్లో ఉన్న ఒక జిల్లా, రెండు జిల్లాల పరిధి, రాష్ట్ర స్థాయి ఈ మూడు రకాల ట్యాక్స్? పాలసీని రద్దు చేసి, అన్ని బస్సుల్లోని సీట్లకు ఒకే రకమైన క్వార్టర్లీ పన్ను విధించేలా అధ్యయనం చేస్తోంది. ఒకే రాష్ట్రం ఒకే పన్ను విధానం తీసుకువచ్చే దిశగా అడుగులు వేస్తోంది.

పెరగనున్న ఆర్థిక భారం :

రాష్ట్రంలో 6,641 ప్రైవేటు బస్సులు కాంట్రాక్ట్ క్యారేజ్ సర్వీసులు కింద తిరుగుతున్నాయి. ఇందులో సాధారణ ప్రయాణికుల కోసం ఆపరేటర్లు నడిపేవాటితో పాటు వివిధ రకాల ప్రైవేటు కంపెనీలు తమ ఉద్యోగుల కోసం నడిపేవీ ఉన్నాయి. ప్రస్తుత విధానంతో సీటుకు కనిష్ఠంగా రూ.1,120 నుంచి గరిష్ఠంగా రూ.3,285 వసూలు చేస్తుండటంతో ప్రతి మూడు నెలలకు రూ.117.83 కోట్ల ఆదాయం రాష్ట్ర ఖజానాకు వస్తోంది. కొత్త పాలసీలో ప్రతి సీటుకు రూ.1,500 లేదా రూ.1,800గా వసూలు చేయాలని రవాణాశాఖ అధికారులు భావిస్తున్నారు.

రూ.200 కోట్లకు పైగా అదనపు రాబడి : బస్సులోని సీటు ధరకు పన్ను రూ.1,500గా నిర్ణయిస్తే రూ.142.23 కోట్ల రాబడితో సంవత్సరానికి దాదాపు రూ.వంద కోట్ల ఆదాయం అదనంగా వస్తుంది. అదే రూ.1,800గా నిర్ణయిస్తే రూ.169.71 కోట్ల ఆదాయంతో ఏడాదికి సుమారు రూ.209 కోట్ల అదనపు రాబడి వస్తుందని అంచనా వేశారు. ఈ భారం అంతిమంగా ప్రయాణికులపై లేదంటే ఉద్యోగుల కోసం నడిపే యాజమాన్యాలపై అనివార్యంగా

మిగతా 4లో..

నో డంపింగ్ యార్డులు
రూ.529 కోట్లతో వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రాలు
మిగతా 4లో..

అంత్యక్రియల కోసం అవస్థలు

- పీకల్లోతు వాగులో మృతదేహాన్ని మోస్తూ పాట్లు

టీ మీడియా జులై 6,హోన్నావర:

సాంకేతిక రంగంలో దేశం పురోగమిస్తున్నప్పటికీ, స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు గడిచినా కొన్ని గ్రామాల్లో కనీస వసతులు కూడా లేవు. కర్ణాటక ఉత్తర కన్నడ జిల్లాలోని హోన్నావర తాలూకా, హోసాకులి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న 'దొడ్డహిట్టలకేరి' గ్రామమే దీనికి ఒక ఉదాహరణ. ఇక్కడ నివసించే వారికి సరైన రహదారి లేదు. ఇంకా అక్కడ ప్రవహించే వాగును దాటడానికి కనీసం వంతెన కూడా లేదు. వర్షాకాలం వచ్చిందంటే చాలు, ఇక్కడి ప్రజల జీవితం నరకప్రాయంగా మారుతుంది. ముఖ్యంగా ఎవరైనా మరణిస్తే పీకల్లోతు ప్రవహించే వాగులో ప్రమాదకరంగా మృతదేహాన్ని తీసుకెళ్లి అంత్యక్రియలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది.

ఇళ్లలోకి వరద నీరు- పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం

దొడ్డహిట్టలకేరిలో 50కి పైగా ఇళ్లు, 150 మందికి పైగా జనాభా ఉన్నారు. ఈ గ్రామానికి చేరుకోవడానికి సరైన రహదారి లేకపోవడంతో, దశాబ్దాలుగా ప్రైవేట్ భూములు, తోటల గుండానే రాకపోకలు సాగిస్తున్నారు. అయితే, పశ్చిమ కనుమల ఎగువన ఉన్న సిద్దాపుర ప్రాంతంలో భారీ వర్షాలు కురిసినప్పుడు, గ్రామం గుండా ప్రవహించే భాస్కేరి వాగు పొంగిపొర్లుతుంది. దీంతో వరద నీరు తోటలు, దారులను దాటి

ఇళ్లలోకి ప్రవేశిస్తుంది. ఫలితంగా అనేక కుటుంబాలు పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందాల్సి వస్తోంది. నిత్య అవసరాల కోసం గ్రామస్థులు, మహిళలు, పాఠశాల విద్యార్థులు నడుము లోతు, కొన్నిసార్లు అయితే పీకల్లోతు నీటిలో నడిచి తమ పనులకు వెళ్లాల్సి వస్తోంది.

మెడ లోతు నీటిలో మృతదేహాన్ని మోసుకెళ్లిన గ్రామస్థులు

జూలై 1న గ్రామానికి చెందిన క్రిస్టెన్ జోసెఫ్ రోడ్రిగ్స్ మరణించారు. అతడి అంత్యక్రియల కోసం గ్రామస్థులు మృతదేహాన్ని మెడ లోతు నీటిలో మోసుకుంటూ వెళ్లాల్సి వచ్చింది. కనీస వసతులు లేకపోవడం వల్ల మృతదేహాన్ని గౌరవప్రదంగా, సురక్షితంగా తరలించలేని పరిస్థితి ఏర్పడిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిపాలనా యంత్రాంగం, ప్రజాప్రతినిధుల వైఫల్యానికి ఇది నిదర్శనమని స్థానికులు అంటున్నారు.

దశాబ్దాలుగా ప్రభుత్వాన్ని కోరుతున్న స్థానికులు

భాస్కేరి వాగుపై శాశ్వత వంతెన, గ్రామానికి రహదారిని నిర్మించాలని స్థానికులు దశాబ్దాలుగా ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అయితే, వివిధ సాంకేతిక కారణాలు, వివాదాల సాకుతో పనులు ప్రతిసారీ వాయిదా వేస్తున్నారు. "మేము ఇక్కడ వందల ఏళ్లుగా నివసిస్తున్నాం. కానీ ప్రతి వర్షాకాలంలో ప్రాణభయంతో గడపాల్సి వస్తోంది. పిల్లల చదువు, ఉపాధి, ఆరోగ్య సేవలు అన్నీ దెబ్బతింటున్నాయి. ప్రభుత్వం మా కోసం వెంటనే శాశ్వత వంతెన, రహదారిని నిర్మించాలి." అని స్థానికుడు బలరామ నాయక్ డిమాండ్ చేశారు.

స్థానికులే వంతెన నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారు : ఎమ్మెల్యే దినకర్ శెట్టి

"ఆ వంతెన నిర్మాణం కోసం నేను స్వయంగా గ్రామాన్ని సందర్శించాను. అధికారులు కూడా సర్వే నిర్వహించారు. అయితే, అక్కడ నివసించే కొందరు వంతెన నిర్మాణాన్ని అడ్డుకున్నారు. ప్రజలు కోరిన చోటల్లా నేను వంతెనలను నిర్మించాను. కానీ ఇక్కడ ప్రైవేట్ భూమి ఉండటం వల్ల, వంతెనకు ఇరువైపులా తగినంత స్థలం లేదు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి ప్రయత్నిస్తాను. ఈ పనికి రాజకీయ అడ్డంకులు కూడా ఉన్నాయి." అని హోన్నావర బీజేపీ ఎమ్మెల్యే దినకర్ శెట్టి అన్నారు. ఇదిలా ఉండగా, పశ్చిమ కనుమల్లో గత కొద్ది రోజులుగా కుండ పోత వర్షాలు కురుస్తున్నాయి. ఫలితంగా తుంగ, భద్ర, షరావతి, హేమావతి, కావేరీ, కృష్ణ, దూధ్గంగా, ఘటప్రభ తదితర నదుల్లో నీటి ప్రవాహం పెరిగింది. వేసవి కాలమంతా ఎండిపోయిన నదులు ప్రస్తుతం జలకళ సంతరించుకున్నాయి. ఈ క్రమంలోనే వాగులు పొంగిపొర్లుతూ ఇలాంటి ఘటనలకు దారి తీస్తున్నాయి.

మున్నూరు కాపులు నిబద్ధతతో పని చేస్తారు : ఆర్జేసి కృష్ణ

టి మీడియా, జూలై 6,ఖమ్మం :

మున్నూరు కాపులు ఏ పోస్టులో వున్నా నిబద్ధత తో పని చేస్తారని మున్నూరు కాపు సంక్షేమ సంఘం సీనియర్ నాయకులు గుండాల కృష్ణ పేర్కొన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడి గా పదవీ విరమణ గావించిన రాకం శ్యాం అభినందన సభ సోమవారం రాత్రి నగరంలోని ఫంక్షన్ హాలులో జరిగింది. ఈ కార్యక్రమానికి కృష్ణ అతిథిగా పాల్గొని శ్యామ్ ను సన్మానించి మాట్లాడారు. ఉపాధ్యాయుడి గా శ్యాం నిర్వహించిన సేవలు స్ఫూర్తి ఫాయకమని అన్నారు. వాకర్స్ అసోషియేషన్ బాధ్యులుగా కూడా ఆయన సామాజిక సేవ చేస్తుంటారని దీనిని కొనసాగించాలని ఆకాంక్షించారు. మున్నూరు కాపులకు ఖమ్మం లో సరైన పోస్టింగ్ లు ఇవ్వడం లేదని వెల్లడించారు . దీనిని మున్నూరు కాపు సమాజం చూస్తోంది అని అన్నారు. వయసు కే పదవీ విరమణ తప్ప మనస్సు కు కాదని అన్నారు. ఇప్పటికే మున్నూరు కాపు సంక్షేమ సంఘానికి ఆయన చేస్తున్న సేవలు మరింత విస్తరింప జేయాలన్నారు. దీనికి తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. అనంతరం ఇటీవల మున్నూరు కాపు వసతి గృహం ట్రస్టు బోర్డు చైర్మన్ గా ఎంపికైన కనకం జనార్దన్,టి ఆర్ ఆర్ హాస్పటల్ వైద్యులు తోట లక్ష్మణ్ లను కూడా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం లో మేకల భిక్షమయ్య,ఉద్యోగ సంఘం అధ్యక్షులు పెద్దబోయిన నాగరాజు,కార్యదర్శి సోమయ్య, కోశా ధికారి అచ్యుత్, దేవిశెట్టి వెంకటేశ్వర్లు,నిమ్మల మురళీ,పగడాల రాం ప్రసాద్,శ్రీనివాస్,కనకం భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

బహ్రెయిన్ బీచ్‌లో తెలంగాణ వాసి మృతి

టి మీడియా, జూలై 7, నిజామాబాద్ :

బహ్రెయిన్‌లో తెలంగాణ వాసి మృతి చెందడం స్థానికంగా విషాదం నింపింది. నిజామాబాద్ జిల్లాకు చెందిన తోట శ్రీనివాస్ పని నిమిత్తం బహ్రెయిన్ వెళ్లారు. దుర్రత్ అల్ బహ్రెయిన్ సముద్ర తీరంలో గడుపుతున్న సమయంలో శ్రీనివాస్ ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయారు. సమాచారం అందుకున్న కోస్ట్ గార్డ్ బృందాలు వెంటనే రంగంలోకి దిగి గాలింపు చర్యలు చేపట్టాయి. అయితే అప్పటికే శ్రీనివాస్ ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు నిర్ధారించారు.

ఏడేళ్లుగా బహ్రెయిన్‌లోనే పని

శ్రీనివాస్ ఉపాధి కోసం బహ్రెయిన్ వెళ్ళి చాలా కాలం అయ్యింది. అక్కడ ఉన్న మహమ్మద్ అహ్మద్ కో (హీూజ) సంస్థలో 2019 నుంచి పని చేస్తున్నారు. కుటుంబ పోషణ కోసం విదేశాలకు వెళ్లిన శ్రీనివాస్ ఇలా అకాల మరణం చెందడం కుటుంబ సభ్యులను శోకసంద్రంలో ముంచింది. తన స్వస్థలానికి పంపాలని కుటుంబ సభ్యులు ప్రభుత్వం కోరుతున్నారు. శ్రీనివాస్ మరణ వార్త తెలియగానే నిజామాబాద్ జిల్లాలోని ఆయన స్వగ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

సహాయక చర్యలు, మృతదేహ తరలింపు

ప్రమాదం జరిగిన వెంటనే కోస్ట్ గార్డ్ బృందాలు మృతదేహాన్ని వెలికితీశారు. ఘటనపై బహ్రెయిన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అక్కడి భారత రాయబార కార్యాలయ అధికారులు మృతుడి కుటుంబ సభ్యులకు పూర్తి సమాచారం అందించారు. మృతదేహాన్ని త్వరగా స్వదేశానికి తరలించేందుకు కావాల్సిన ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రవాస భారతీయులు శ్రీనివాస్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నారు.

ఖరీఫ్‌పై ఎల్‌నినో ఎఫెక్ట్

- ఏపీలోని 16 జిల్లాల్లో లోటు వర్షపాతం

టి మీడియా, జూలై 6, అమరావతి బ్యూరో :

ఏపీలో ఈ ఏడాది ఖరీఫ్ ఆరంభం నుంచే రైతన్నలకు కష్టాలు మొదలయ్యాయి. నైరుతి రుతుపవనాలు రాష్ట్రాన్ని పలకరించినా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. రాష్ట్రంపై 'ఎల్‌నినో' ప్రభావం తీవ్రంగా కనిపిస్తోంది. దీంతో ఆకాశం మొహం చాటేసింది. జూన్ 1వ తేదీ నుంచి జులై 5వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ఏకంగా 16 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైంది. సాధారణంగా కురవాల్సిన దానికంటే 28.9 శాతం తక్కువగా వానలు పడ్డాయి. పశ్చిమ గోదావరి, అన్నమయ్య జిల్లాల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. అక్కడ సాధారణం కంటే 53.4 శాతం తక్కువగా వర్షపాతం నమోదైంది.

404 మండలాల్లో వర్షాభావం

రాష్ట్రంలోని కొన్ని మండలాల్లో మాత్రమే వర్షాలు ఆశాజనకంగా కురిశాయి. అక్కడ మాత్రమే ఖరీఫ్ సాగు ఊపందుకుంది. జూన్ మొదటి వారంలో కొన్నిచోట్ల వానలు పడినా, ఆ తర్వాత వర్షాభావ

పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో రైతులు పంటలు వేయడానికి వెనుకంజ వేశారు. రాష్ట్రంలో మొత్తం 688 మండలాలు ఉన్నాయి. వీటిలో 404 మండలాల్లో తక్కువ వర్షాలు కురిశాయి. ఇందులో 265 మండలాల్లో లోటు వర్షపాతం నమోదు కాగా, 139 మండలాల్లో తీవ్ర లోటు నెలకొంది. కేవలం 284 మండలాల్లో మాత్రమే మంచి వర్షాలు పడ్డాయి. వాటిలో 26 చోట్ల భారీ వర్షాలు, 76 చోట్ల సాధారణం కంటే ఎక్కువ, 182 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది.

పంటల సాగు పరిస్థితి ఇదీ : వర్షాభావం కారణంగా రాష్ట్రవ్యాప్తంగా పంటల సాగు మందకొడిగా సాగుతోంది. 28 జిల్లాల పరిధిలో ఇప్పటివరకు వివిధ పంటలు వేశారు. పత్తి సాగు అత్యధికంగా 4.65 లక్షల ఎకరాల్లో జరిగింది. వరి పంటను 3.62 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. కంది పంట 1.18 లక్షల ఎకరాల్లో, మొక్కజొన్న 66 వేల ఎకరాల్లో వేశారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 12 జిల్లాల్లో మాత్రమే సాధారణం కంటే సాగు విస్తీర్ణం పెరిగినట్లు వ్యవసాయ శాఖ గణాంకాలు చెబుతున్నాయి.

ఆ జిల్లాల్లో నామమాత్రంగానే సాగు : వర్షాలు లేకపోవడంతో పలు జిల్లాల్లో సాగు ఆందోళనకరంగా ఉంది. పోలవరం, గుంటూరు, మార్కాపురం, అన్నమయ్య, ప్రకాశం, అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో సాగు దారుణంగా పడిపోయింది. ఇక్కడ సాధారణం కంటే 80 శాతం తక్కువగా పంటలు వేశారు. అలాగే బాపట్ల, అనకాపల్లి, చిత్తూరు, తూర్పుగోదావరి, పార్వతీపురం మన్యం, అనంతపురం, వైఎస్సార్ కడప, నంద్యాల జిల్లాల్లో కూడా సాధారణం కంటే 30 శాతం నుంచి 79 శాతం మేర తక్కువగా పంటలు సాగయ్యాయి.

ఈ జిల్లాల్లో సాగు ఆశాజనకం : కొన్ని జిల్లాల్లో మాత్రం పంటల సాగు మెరుగ్గా ఉంది. ముఖ్యంగా కర్నూలు జిల్లాలో సాగు ఎంతో ఆశాజనకంగా ఉందని వ్యవసాయశాఖ నివేదికలు వెల్లడించాయి. కాకినాడ జిల్లాలో కూడా సాధారణం కంటే సాగు పెరిగింది. వీటితో పాటు శ్రీకాకుళం, ఏలూరు, ఎన్టీఆర్, అల్లూరి సీతారామరాజు, పశ్చిమ గోదావరి, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, తిరుపతి, పల్నాడు, విశాఖపట్నం, శ్రీసత్యసాయి, కృష్ణా జిల్లాల్లో ఖరీఫ్ పంటల సాగు ఉత్సాహంగా సాగుతోంది.

పారిశుధ్య కార్యక్రమాల తనిఖీ చేసిన కమిషనర్

టీ మీడియా, జులై 6, ఆత్మకూరు:

వనపర్తి జిల్లా ఆత్మకూర్ మున్సిపాలిటీలో మున్సిపల్ కమిషనర్ నరేష్ కుమార్ పలు ప్రాంతాల్లో పర్యటించి ఎస్ ఐ ఆర్, ఫీల్డ్ లెవల్ తనిఖీలు, పారిశుద్ధ్య కార్యక్రమాల పరిశీలించారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఇటీవల పరిష్కరించిన తాగునీటి సమస్యను పరిశీలించారు. మొదటగా ఎస్ ఐ ఆర్ కార్యక్రమం అమలవుతున్న ప్రాంతాలను సందర్శించిన కమిషనర్, క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులను పరిశీలించి, విధులను నిబంధనలకు అనుగుణంగా సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. అనంతరం పట్టణంలోని పలు వార్డుల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించి, చెత్త సేకరణ, కాలువల శుభ్రత, రహదారుల పరిశుభ్రత తదితర పనులను సమీక్షించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు నిరంతరం చర్యలు కొనసాగించాలని అధికారులకు ఆదేశించారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించిన కమిషనర్, ఇటీవల పరిష్కరించిన తాగునీటి సమస్య అనంతరం ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించి, ప్రస్తుతం విద్యార్థినులకు తగిన విధంగా నీటి సరఫరా జరుగుతున్నట్లు నిర్ధారించారు. భవిష్యత్తులో కూడా ఎలాంటి అంతరాయం లేకుండా నీటి సరఫరా కొనసాగించేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత మున్సిపల్ అధికారులు, వార్డు సిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభానికి విచ్చేయుచున్న మంత్రి

టీ మీడియా, జూన్ 6, ఆత్మకూరు :

వనపర్తి జిల్లా ఆత్మకూరు అమర్ చింత మండలాలలో వ్యవసాయ మార్కెట్ కమిటి ఆత్మకూరు, మార్కెట్ యార్డ్ నందు నూతన మార్కెట్ కార్యాలయపు భవనం నిర్మాణం రూ.85.00 లక్షల పనులకు భూమి పూజ చేసి పనులు ప్రారంభించడానికి డాశ్రీశ్రీ వాకిటి శ్రీహరి రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పరిశ్రమ, మత్స్య శాఖ, క్రీడలు, యువజన శాఖ మంత్రివర్యులు విచ్చేయుచున్న రని ఆత్మకూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తెలిపారు.

అందుబాటులో ఉండటమే ప్రజాప్రతినిధుల బాధ్యత

- మంత్రి వివేక్ వెంకటస్వామి

టీ మీడియా, జులై 6, రామకృష్ణాపూర్:

క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో మంత్రి వివేక్ వెంకటస్వామి సోమవారం మార్నింగ్ వాక్‌లో భాగంగా 9వ వార్డులోని పలు వీధుల్లో కాలినడకన తిరుగుతూ స్థానిక ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. ఈ వాక్ లో ప్రజల సమస్యలు,స్థానిక అవసరాలను స్వయంగా అడిగి వార్డులో పారిశుద్ధ్యం,తాగునీటి సరఫరా,రహదారులు,డ్రైనేజీ తదితర మౌలిక వసతులపై ప్రజల నుంచి వచ్చిన వినతులను పరిశీలించి,సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండటమే ప్రజాప్రతినిధుల బాధ్యత అని ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యకలాపాల ఫలాలు ప్రతి కుటుంబానికి చేరేలా కృషి చేస్తామని మంత్రి అన్నారు. ఈ వాక్ లో ప్రజాప్రతినిధులు,పార్టీ నాయకులు ,మున్సిపల్ అధికారులు,కార్యకర్తలు,వార్డు ప్రజలు పాల్గొన్నారు.

ప్రియురాలి కోసం జైలు నుండి పారిపోయి వచ్చి

టీ మీడియా .జూన్ 6, ఆత్మకూరు:



వనపర్తి జిల్లా అమరచింత మండలం నందిమల్ల గ్రామానికి చెందిన కిషోర్ కుమార్ రెడ్డి గత కొన్ని రోజుల క్రితం ఫోక్సో కేసు పై జైలుకు వెళ్లడం జరిగింది. ఉదయం తెల్లవారుజామున జైలు నుండి పరారైనట్లు, వార్తలు వచ్చాయి, జైలు అధికారులు ఆత్మకూరు ,అమరచింత పరిసర ప్రాంతాలలో గాలింపు చర్యలు చేపట్టారు. తండ్రిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నేడు మధ్యాహ్నం గ్రామ సమీపంలో వరి చేనులకు వాడే నూతనంగా వచ్చిన నానో యూరియా తాగినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులు వెంబడే ఆత్మకూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఆత్మకూరు సిఐ శివకుమార్, అమరచింత ఎస్సై స్వాతి ఆసుపత్రికి చేరుకున్నారు. ప్రథమ చికిత్స నిర్వహించిన వైద్యులు, మెరుగైన వైద్యం కోసం వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కిషోర్ ప్రస్తుతం వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానాలో చికిత్స పొందుతూ ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడని వైద్యులు తెలిపారు.

వాన దేవుని కోసం పాటలతో ఇంటింటి మహిళలు

టీ మీడియా, జులై 6, పెబ్బేరు:

వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణం గ్రామీణ ప్రాంతాలలో వర్షం కోసం కప్ప కాలుకు తాడు కట్టి ఓక కట్టేకు మధ్యలో కట్టి వేలాడదీసి అటొకరు ఇటొకరు పట్టుకుని ఇంటింటికీ తిరిగేవారు అలాగే వానాకాలం వచ్చినా వర్షాలు కురవక ఎండలు తీవ్రంగా ఉండటంతో పెబ్బేరు మండల ప్రాంతాల్లో మహిళలు ఇంటింటికి తిరుగుతూ వాన దేవుని పాటలు పాడుతున్నారు మంచి వర్షాలు కురిసి పంటలు పండాలని చెరువులు నిండాలని రైతన్నలు సంతోషంగా ఉండాలని ప్రార్థిస్తూ సంప్రదాయంగా ఇంటిపాటలు ఆలపిస్తున్నారు ప్రజలు కూడా ఈ ప్రాచీన ఆచార వ్యవహారాల్లో భాగంగా వాన దేవుని కరుణ కటాక్షం కోసం గ్రామాల్లోని మహిళలు ప్రార్థనలు చేస్తున్నారు.

వృద్ధురాలిని బావిలో తోసేసిన విద్యార్థి

- 21 గంటలు ప్రాణాల కోసం పోరాటం

టీ మీడియా జులై 6, కరీంనగర్ :

వ్యవసాయ బావి వద్ద పని ఉందని చెప్పి ఓ వృద్ధురాలిని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకువెళ్లి, ఆమె వద్ద నున్న బంగారు ఆభరణాలు కాజేసి అనంతరం బావిలో తోసేసి హత్యాయత్నం చేశాడు ఓ విద్యార్థి. 21 గంటల పాటు బావిలోనే నరకయాతన అనుభవించిన ఆ వృద్ధురాలు చివరకు కొందరి రైతుల సాయంతో సురక్షితంగా బయటకు వచ్చారు. ఈ ఘటన కరీంనగర్? జిల్లాలో చోటుచేసుకుంది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని పట్టుకున్నారు.

అసలేం జరిగిందంటే?

కరీంనగర్ పట్టణంలోని కిసాన్ నగర్?కు చెందిన గంగాధర లక్ష్మీ మూమూలు అడ్డాకూలీగా పనిచేస్తున్నారు. రోజూ లాగే టవర్ సర్కిల్ వద్ద పని కోసం వెళ్లింది. తన వ్యవసాయ బావి వద్ద పని ఉందని చెప్పిన ఓ యువకుడు ఆమెను అక్కడి నుంచి తీసుకువెళ్లాడు. కరీంనగర్ నుంచి తిమ్మాపూర్ వరకూ ఆమె కోసం రాపిడో బుక్ చేశాడు. ముందు ఆమె రాపిడో బైక్ మీద వెళ్తే తన బైక్?పై తిమ్మాపూర్ వరకూ ఫాలో ఆయ్యాడు. అక్కడి నుంచి ఆమెను నుస్తూలాపూర్ రైతువేదిక సమీపంలోని ఓ వ్యవసాయ బావి వద్దకు తన బైక్?పై తీసుకెళ్లాడు.

బంగారం కాజేసి, వృద్ధురాలిని బావిలో తోసి



నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లినా, ఏదో పని ఉండి ఉంటుందిలే అని ఆమె భావించింది. అప్పుడే అతని అసలు స్వరూపం బైటపడింది. వెంటనే ఆమె చెవికి ఉన్న బంగారు కమ్మలు తీసి ఇవ్వాలని అడిగాడు. ప్రాణభయంతో వణికిపోయిన ఆ వృద్ధురాలు వాటిని తీసి ఇచ్చేసింది. ఇక తనకు ప్రాణభయం తప్పిందనుకునేంత లోపే ఆమెను పక్కనే ఉన్న బావిలోకి తోసేశాడు. ఆ బావిలో ఉన్న తాడు సాయంతో బయటకు వద్దామని ప్రయత్నించింది. వృద్ధురాలు ప్రాణాలతో బయట పడకూడదని ఆ తాడును కూడా కోసేసి అక్కడ నుంచి పరారయ్యాడు ఈ దుర్మార్గుడు. లక్ష్మీకి స్విమ్మింగ్ రావడంతో ఈదుతూ వచ్చి అక్కడ ఉన్న విద్యుత్ వైరును పట్టుకుని ప్రాణాలు దక్కించుకుంది. బావిలో నుంచి బయట పడేందుకు 21 గంటలుగా ఆమె చేసిన ఆర్తనాదాలు అరణ్య రోదనగానే మిగిలాయి. నిర్మానుష్య ప్రాంతం కావడంతో అక్కడ ఆమెను ఆదుకునే నాథుడే కరవయ్యాడు. మరుసటి రోజు ఉదయం బావి వద్దకు వచ్చిన రైతులు ఆమె కేకలు విని స్థానికుల సాయంతో ప్రాణాలు రక్షించారు. సుమారు 22 గంటలు బావిలోనే బిక్కుబిక్కుమంటూ గడిపిన మహిళ అదృష్టవశాత్తు ప్రాణాలతో బైటపడింది.

నిందితుడు అరెస్టు

స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు, బాధితురాలి వాంగ్మూలం ప్రకారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. వృద్ధురాలిని రాపిడోపై తిమ్మాపూర్ వరకూ దింపిన బైక్ డ్రైవర్, యాప్?లోని సమాచారం అధారంగా నిందితుడు గొల్లపల్లికి చెందిన దినేశ్ రెడ్డిగా తేల్చారు. కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పోలీసులు సీసీటీవీ ఫుటేజ్, సెల్ ఫోన్ సిగ్నల్స్, ఇతర సాంకేతిక ఆధారాలతో నిందితున్ని మార్కెట్ సమీపంలోని అమరవీరుల స్థూపం వద్ద నిందితుడిని అరెస్టు చేశారు. అతడి నుంచి మొబైల్ ఫోన్, బాధితురాలి మొబైల్ ఫోన్, నేరానికి వినియోగించిన బైక్, రూ.5వేల నగదు, బాధితురాలి వెండి మట్టెలు స్వాధీనం చేసుకున్నారు. దోచుకున్న బంగారం టవర్ సర్కిల్?లోని మనోహరచారి అనే వ్యక్తికి అమ్మి నిందితుడు రూ.30వేలు తీసుకున్నాడు. దీంతో ఈ కేసులో అతన్ని అరెస్టు చేశారు. మనోహరచారి నుంచి రెండు బంగారుపుస్తెలు, ఐదు బంగారు గుండ్లు, చెవికమ్మలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఇంటిపై విరిగిపడిన కొండ చరియలు..

- ఒకరి మృతి, ఇద్దరు గల్లంతు

టి మీడియా, జూలై 7, పుణె:

మహారాష్ట్రలోకురుస్తున్న భారీ వర్షాలు జనజీవనానని అతలాకుతలం చేస్తున్నాయి. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. భారీ వర్షాల కారణంగా పుణె జిల్లాలో కొండచరియలువిరిగిపడిన ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరు గల్లంతయ్యారు. మావల్ తాలూకాలోని పటాన్ గ్రామంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న వెంటనే ఎన్‌డీఆర్ఎఫ్, స్థానిక పోలీసులు, అగ్నిమాపక దళం ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టాయి. శిథిలాల కింద చిక్కుకుపోయినట్లు భావిస్తున్న ఇద్దరిని గుర్తించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా, రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలతో కర్జత్-లోనావాలా ఘాట్ సెక్షన్‌లో కొండచరియలు విరిగిపడటంతో ముంబై-పూణేల మధ్య రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. 16 రైళ్లను రద్దు చేయగా మరికొన్నింటిని దారి మళ్లించారు. భద్రతా కారణాల దృష్ట్యా ముంబై-పూణే ఎక్స్‌ప్రెస్‌వే, పాత ముంబై-పూణే హైవేపై రాకపోకలను కూడా తాత్కాలికంగా నిలిపివేశారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావొద్దని అధికారులు సూచించారు.

లో స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు

టీ మీడియా, జులై 6 ,పెబ్బేరు:

వనపర్తి జిల్లా పెబ్బేరు మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్ అనంతరం మల్టీమీడియా అ ండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగంలో మిగిలిపోయిన 42 సీట్లకు ఈనెల 8వ తేదీ వరకు కళాశాలలో సంప్రదించి దరఖాస్తు చేసుకుని అడ్మిషన్ పొందగలరని కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్ర తెలియజేశారు అభ్యర్థులు తప్పనిసరిగా స్వయంగా హాజరై టి జి పాలిసెట్-- 2026 ర్యాంక్ కార్డు (అర్హత సాధించినవారికి)ఎస్ ఎస్ సిమార్కుల మెమో 4వ తరగతి నుండి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు ట్రాన్స్‌ఫర్ సర్టిఫికేట్ (టి.సి.) అవసరమైతే కుల ధ్రువీకరణ పత్రం నివాస ధ్రువీకరణ పత్రం తదితర అసలు ధ్రువపత్రాలతో పాటు వాటి జిరాక్స్ ప్రతులను తీసుకురావాలని కోరారు. పూర్తి వివరాల కొరకు అభ్యర్థులు కళాశాలను సందర్శించగలరని అన్నారు.

అంగన్వాడీ పోస్టుల భర్తీకి ప్రకటన

టీ.మీడియా,జూలై6,చింతూరు:



చింతూరు ఐటీడీఏ పిఓ ఆదేశాల మేరకు, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్, చింతూరు డివిజన్ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారు. చింతూరు డివిజన్ పరిధిలో భర్తీ చేయనున్న పోస్టుల వివరాలు తెలిపారు. అంగన్వాడీ వర్కర్లు -- 2 పోస్టుల మినీ అంగన్వాడీ వర్కర్లు -- 2 పోస్టులు, అంగన్వాడీ హెల్పర్లు -- 104 పోస్టులుమొత్తం ఖాళీలు : 108 పోస్టులు ఉన్నాయని అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు నోటిఫికేషన్‌లో పేర్కొన్న విద్యార్హతలు, వయోపరిమితి, స్థానికత, అవసరమైన ధ్రువపత్రాలు, ఎంపిక విధానం, దరఖాస్తు గడువును జాగ్రత్తగా పరిశీలించి, నిర్ణీత గడువులోపు సంబంధిత ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. నోటిఫికేషన్‌కు సంబంధించిన పూర్తి వివ

పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించిన డీజీపీ సి.వి. ఆనంద్

- మెరుగైన పోలీసు సేవలందించడమే లక్ష్యం

టి మీడియా, జూలై 6, మణుగూరు:

జిల్లాలో శాంతిభద్రతలను మరింత పటిష్టం చేయడంతో పాటు ప్రజలకు ఆధునిక సౌకర్యాలతో కూడిన మెరుగైన పోలీసు సేవలు అందించాలనే లక్ష్యంతో మణుగూరులో నూతనంగా నిర్మించిన పోలీస్ స్టేషన్‌ను తెలంగాణ రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ రోహిత్ రాజు, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, పోలీసు శాఖ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సీసీటీవీ మానిటరింగ్ సెల్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీపీ సి.వి. ఆనంద్ మాట్లాడుతూ, సింగరేణి సంస్థ సహకారంతో నూతన పోలీస్ స్టేషన్ నిర్మాణం పూర్తయిందని, ప్రజలకు మరింత మెరుగైన, వేగవంతమైన పోలీసు సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రజల ప్రాణాలు, ఆస్తులు, హక్కుల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలో నేరాల నియంత్రణతో పాటు అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతూ సమర్థవంతంగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం ద్వారా పోలీసు సేవలను మరింత సమర్థవంతంగా అందించగలుగుతున్నామని డీజీపీ తెలిపారు. నేరాల నియంత్రణ, దర్యాప్తు, సీసీటీవీ నిఘా, సైబర్ నేరాల విచారణ వంటి అంశాల్లో సాంకేతికత కీలక పాత్ర పోషిస్తోందన్నారు. మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా సమాజాన్ని వినాశన దిశగా నడిపిస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. భావితరాలను ఈ ప్రమాదం నుంచి కాపాడేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. ఇందులో భాగంగా ఈగల్ వంటి ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేసి, కింది స్థాయి సిబ్బంది నుంచి ఉన్నతాధికారుల వరకు సమన్వయంతో మాదకద్రవ్యాల నిర్మూలన కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. సైబర్ నేరాలు, ట్రాఫిక్ రహదారి ప్రమాదాల నివారణపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా చేసే ముఠాలను తీవ్రవాదుల మాదిరిగానే పరిగణిస్తూ కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ అంకిత్ నూతన పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సీసీటీవీ మానిటరింగ్ సెల్‌ను ప్రారంభించి, పోలీస్ స్టేషన్‌లో కల్పించిన ఆధునిక మౌలిక సదుపాయాలను పరిశీలించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు సత్వర, పారదర్శక పోలీసు సేవలందించడంలో జిల్లా యంత్రాంగం పోలీసు శాఖతో సమన్వయంగా పనిచేస్తోందన్నారు.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం ద్వారా నేరాల నియంత్రణతో పాటు ప్రజలకు మరింత నాణ్యమైన సేవలు అందించేందుకు ఈ నూతన పోలీస్ స్టేషన్ దోహదపడుతుందని పేర్కొన్నారు. అనంతరం డీజీపీ, ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీతో కలిసి పోలీస్ స్టేషన్‌లోని వివిధ విభాగాలను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. ప్రజలకు స్నేహపూర్వక, పారదర్శక, జవాబుదారీతనంతో కూడిన పోలీసు సేవలు అందించాలని పోలీసు అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు శాఖ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, సింగరేణి సంస్థ ప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఎన్యుమరేషన్ ఫాంలను ఆన్ లైన్ చేయాలి

టీ మీడియా,06 జులై పెబ్బేరు:

వనపర్తి జిల్లా పెబ్బేరు ఉమ్మడి మండలాలలో ఎస్ ఐ ఆర్ పూరించిన ఎన్యూమరేషన్ ఫారాలను ఓటర్ల నుండి తీసుకొని ఆన్లైన్ లో నమోదు చేసే ప్రక్రియ వేగవంతం చేయాలని ఆర్డీఓ సుబ్రమణ్యం బి ఎల్ ఓ ల ను ఆదేశించారు ఓటర్ల నుండి పూరించిన ఫారాలను ఇంటింటికి తిరిగి తీసుకోవాలని ఫారం నింపడం తెలియని ఓటర్లకు బూత్ లెవల్ ఆఫీసర్లు దగ్గరుండి సహాయం చేయాలని ఆర్డీఓ ఓటరు నమోదు అధికారి సుబ్రమణ్యం బి ఎల్ ఒ లను ఆదేశించారు పెబ్బేరు శ్రీరంగాపూర్ మండలాల్లో పర్యటించి బూత్ లెవల్ అధికారులు సూపర్ వైజర్ల పనితీరును జిల్లాలో ఎస్ ఐ ఆర్ కొనసాగుతున్న ప్రక్రియను పరిశీలించారు వనపర్తి శాసన సభ నియోజక వర్గంలో ఓటర్ జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ ఐ ఆర్) చేయు విషయములో పెబ్బేర్ మండలం రంగాపూర్ కంచిరావుపల్లి శ్రీరంగాపూర్ మండలములోని కంబాలాపూర్ గ్రామాలకు సంబందించిన పోలింగ్ స్టేషన్ నెం 222 223 225 252 253 202 పోలింగ్ స్టేషన్ లను సందర్శించి బూత్ లెవల్ అధికారులు ఎన్యూమరేషన్ గణన ఫారం ఓటర్లకు పంపిణి చేయుచున్న కార్యక్రమాన్నీ ఆకస్మికంగా తనిఖీ చేసారు.

దారి తప్పిన చేయూత

- మూడేళ్లుగా ఇతర ఖాతాలో వితంతు పింఛన్ జమ

టీ మీడియా,జులై6,ఖమ్మం రూరల్:

వితంతువుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న చేయూత పింఛన్ పథకం తనగంపాడు గ్రామంలో దారి తప్పిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఒకటి, రెండు నెలలు కాదు... ఏకంగా మూడేళ్లుగా లబ్ధిదారురాలికి రావాల్సిన పింఛన్ సొమ్ము మరొకరి బ్యాంకు ఖాతాలో జమ అవుతున్నట్లు అధికారుల వెరిఫికేషన్‌లో బయటపడింది. ఖమ్మం రూరల్ మండలం తనగంపాడు గ్రామానికి చెందిన సీతమ్మకు 2023లో ప్రభుత్వం వితంతు పింఛన్ మంజూరు చేసింది. అయితే అప్పటి నుంచి ఆమె ఖాతాలో కాకుండా మరో వ్యక్తి బ్యాంకు ఖాతాలోనే ప్రతి నెలా పింఛన్ జమ అవుతున్నట్లు సమాచారం. దీంతో మూడేళ్లుగా ఆమె ప్రభుత్వ ఆర్థిక సహాయానికి దూరమయ్యారు. ఈ విషయాన్ని బాధితురాలు పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. ఇటీవల చేపట్టిన చేయూత పింఛన్ వెరిఫికేషన్ సందర్భంగా అధికారులు విచారణ జరపగా ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనలో గతంలో గ్రామంలో విధులు నిర్వహించిన ఓ గ్రామస్థాయి అధికారి నిర్లక్ష్యం లేదా ప్రమేయం ఉందనే ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. బ్యాంకు ఖాతా వివరాలు ఎలా మారాయి? ఎవరి ఖాతాలో పింఛన్ జమ అయింది? ఇందుకు బాధ్యులెవరు? అనే అంశాలపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో పందుల వీరవిహారం

- అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం

టీ మీడియా,జులై06,సింగరేణి(కారేపల్లి):

ఖమ్మం జిల్లా సింగరేణి మండల ప్రజా పరిషత్ (ఎంపీడీవో) కార్యాలయ ప్రాంగణం పరిశుభ్రతకు దూరమై పందుల సంచారానికి నిలయంగా మారింది. నిత్యం ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణంలో పందులు స్వేచ్ఛగా తిరుగుతుండటం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా కనిపిస్తోంది. ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలకు ఆదర్శంగా నిలవాల్సి ఉండగా, ఎంపీడీవో కార్యాలయం పరిసరాల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొనడం స్థానికులను ఆందోళనకు గురిచేస్తోంది. కార్యాలయ ఆవరణలో చెత్త పేరుకుపోవడం, పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేకపోవడం వల్లే పందుల సంచారం పెరిగిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పించాల్సిన అధికారులు తమ కార్యాలయ పరిసరాలను శుభ్రంగా ఉంచడంలో విఫలమవడం విమర్శలకు తావిస్తోంది. ప్రజల రాకపోకలు అధికంగా ఉండే ప్రభుత్వ కార్యాలయంలో ఈ పరిస్థితి కొనసాగడం సరికాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కార్యాలయ ప్రాంగణాన్ని పూర్తిగా శుభ్రపరిచి, పందుల సంచారాన్ని అరికట్టేందుకు శాశ్వత చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం ద్వారా ప్రజలకు ఆదర్శంగా నిలవాలని విజ్ఞప్తి చేస్తున్నారు

కామేపల్లి హైస్కూల్‌లో ప్రపంచ జూనోసిస్ దినోత్సవం:

- జంతువుల నుండి సంక్రమించే వ్యాధులపై అవగాహన

టీ మీడియా జులై 06 ?కామేపల్లి:-

ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈరోజు కామేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో జూనోసిస్ (జంతువుల నుండి మనుషులకు సంక్రమించే వ్యాధులు)పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్. జి. నాగులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి డాక్టర్. నాగులు మాట్లాడుతూ, జంతువుల ద్వారా వ్యాపించే ముఖ్యమైన వ్యాధులు, వాటి లక్షణాలు మరియు నివారణోపాయాలపై సమగ్రంగా వివరించారు. ముఖ్యంగా పెంపుడు జంతువులకు సకాలంలో టీకాలు వేయించడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, మరియు కుక్క లేదా పిల్లి కరిచినప్పుడు వెంటనే వైద్యులను సంప్రదించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. మనుషులు, జంతువులు, పర్యావరణం ఆరోగ్యంగా ఉంటేనే సమాజం ఆరోగ్యంగా ఉంటుందనే "వన్ హెల్త్" భావన ప్రాముఖ్యతను ఆయన విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలేరులో ఘనంగా గంగమ్మ తల్లి జాతర

టీ మీడియా జులై 6 ,పాలేరు:

నియోజకవర్గ కేంద్రం పాలేరు గ్రామంలో శ్రీ గంగమ్మ తల్లి జాతర సోమవారం వైభవంగా జరిగింది. జాతరతో పాలేరు లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. యాదవుల కులదైవం గంగమ్మ తల్లి మహోత్సవాన్ని ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవడంతో భక్తులు తో నిండుకుంది గ్రామంలో ఆధ్యాత్మిక శోభ డప్పు బ్యాండ్ వాయిద్యాలతో డీజే పాటల మధ్య మారుమోగింది. జాతర ఉత్సవాల్లో భాగంగా యాదవ కులస్థ మహిళలు నెట్టిపై గంపలు ఎత్తుకొని పెద్ద గుంపుతో గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా నృత్యాలు డాన్సులు చేస్తూ కదిలారు. మహిళలు బోనాలు ఎత్తుకొని మంగళ వాయిద్యాల మధ్య, శివ పూనకాలతో గంగమ్మ తల్లి ఆలయానికి చేరుకున్నారు. యాదవ సాంప్రదాయ సంస్కృతి ప్రతిబింబించేలా శ్రీ గంగమ్మ తల్లికి నైవేద్యాలు సమర్పించి, పరిశు సంపదలు చల్లగా ఉండాలని, పంటలు బాగా పండాలని, కుటుంబాల్లో ఆయురారోగ్యాలు కలిగి సుఖ సంతోషాలతో విరజిల్లాలని గంగమ్మ తల్లిని వేడుకుంటూ భక్తులు తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ జాతరతో యాదవ సాంప్రదాయ ఆచార కట్టుబాట్లు ప్రతిబింబించే విధంగా శ్రీ గంగమ్మ తల్లి మహోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో యాదవ కులస్తులు రాసాల శ్రీశైలం ,రాసాల గురవయ్య, దాసరి వెంకటేశ్వర్లు, దాసరి వెంకన్న, కన్నెబోయిన సురేష్, కన్య బోయిన నరేష్, పిల్లలు, పెద్దలు, మహిళలు, యువత, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థిని కిడ్నాప్ కేసు..

- నలుగురికి రిమాండ్

టీ మీడియా,జులై6, సింగరేణి(కారేపల్లి):

కారేపల్లిలోని ఓ గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న మైనర్ విద్యార్థినిని మాయమాటలు చెప్పి బయటకు తీసుకెళ్లిన ఘటనలో నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కారేపల్లి ఎస్సై బైరు గోపి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 4న గురుకులంలోని సిబ్బందికి తాము బాలిక బంధువులమని నమ్మించి, విద్యార్థినిని గంటసేపు బయటకు తీసుకెళ్లేందుకు అనుమతి తీసుకున్నారు. అయితే నిర్ణీత సమయం ముగిసినా బాలిక తిరిగి గురుకులానికి రాకపోవడంతో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ దుర్గాభవాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు వెంటనే దర్యాప్తు ప్రారంభించి, సెల్‌ఫోన్ సాంకేతిక ఆధారాలతో నిందితులను గుర్తించారు. ఖమ్మం పట్టణంలోని టేకులపల్లి ప్రాంతంలో ప్రధాన నిందితుడితో పాటు అతనికి సహకరించిన మరో ముగ్గురు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. మైనర్ బాలికను కిడ్నాప్ చేసినందుకు, అలాగే పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేసి నలుగురినీ సోమవారం కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం వారిని రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై బైరు గోపి వెల్లడించారు.

ప్రజావాణిలో వచ్చిన ప్రతి వినతికి పరిష్కారం

- జిల్లా కలెక్టర్ అంకిత్

టీ మీడియా,జులై6,పాల్వంచ:

ప్రజావాణిలో ప్రజలు సమర్పించే ప్రతి వినతిని అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపేలా సంబంధిత అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐ డి ఓ సి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతితో కలిసి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల వినతులు, ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. భూ వివాదాలు, రెవెన్యూ సమస్యలు, సంక్షేమ పథకాల అమలు, ఉపాధి, మౌలిక వసతులు, సామాజిక భద్రత, ఇతర శాఖలకు సంబంధించిన వివిధ సమస్యలను ప్రజలు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్, సమస్యల స్వభావాన్ని బట్టి సంబంధిత శాఖల అధికారులకు వెంటనే పంపిస్తూ, నిర్దేశిత కాలవ్యవధిలో పరిష్కరించాలని ఆదేశించారు. తక్షణ పరిష్కారం సాధ్యమైన సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని, మిగిలిన వినతులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి ప్రజలకు ప్రభుత్వాన్ని చేరువ చేసే విశ్వసనీయ వేదిక అని అన్నారు . ప్రజల వినతులను కేవలం నమోదు చేయడం కాకుండా, వాటి పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణ రూపొందించి ఫలితాలు కనిపించేలా అధికారులు పనిచేయాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తే సమస్యల పరిష్కారం మరింత వేగవంతమవుతుందని తెలిపారు. ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యానికి ఏమాత్రం తావు లేకుండా ప్రతి అధికారి బాధ్యతతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. ప్రజలు తమ వినతులతో పాటు సంబంధిత ఆధార పత్రాలను సమర్పిస్తే సమస్యల పరిష్కారం మరింత వేగంగా జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు.

స్వీకరించిన కొన్ని వినతులు

సుజాతనగర్ మండలం సింగభూపాలెం గ్రామానికి చెందిన సంఘం నాగేశ్వరరావు, తన తండ్రి మరణించడంతో ఆయన పేరుపై ఉన్న పట్టా భూమిని వారసత్వ హక్కు ప్రకారం తన పేరుకు మార్చాలని చేసిన వినతిని జిల్లా కలెక్టర్ పరిశీలించి, తదుపరి చర్యల కోసం సంబంధిత సెక్షన్ సూపరింటెండెంట్‌కు ఎండార్స్ చేశారు. టేకులపల్లి మండలం రాజు తండా గ్రామానికి చెందిన అజ్మీర రవి, కొత్తగూడెం--ఇల్లందు జాతీయ రహదారి విస్తరణలో తన ప్రహరీ గోడతో పాటు మూడు గదుల ఇల్లు కోల్పోతున్నందున తగిన నష్టపరిహారం మంజూరు చేయాలని చేసిన దరఖాస్తును పరిశీలించి, అవసరమైన చర్యల కోసం టేకులపల్లి తహసీల్దార్‌కు ఎండార్స్ చేశారు. ఇల్లందు మండలం ఇందిరానగర్‌కు చెందిన పోతరాజు రమేష్, గత నాలుగు సంవత్సరాలుగా తీవ్రమైన శారీరక, మానసిక వైకల్యంతో బాధపడుతూ, 50 శాతం వైకల్యం ఉన్నందున కుటుంబానికి ఆర్థిక ఆధారం లేక చికిత్స భారంగా మారిందని పేర్కొంటూ వికలాంగుల పింఛన్ మంజూరు చేయాలని చేసిన దరఖాస్తును జిల్లా కలెక్టర్ పరిశీలించి, తదుపరి చర్యల కోసం సంబంధిత అధికారికి ఎండార్స్ చేశారు. బూర్గంపహాడ్ మండలం ఎదుళ్ల చెరువు గ్రామానికి చెందిన దుర్గాల వెంకటేశ్వర్లు, తాను 2000 సంవత్సరం నుంచి సాగు చేస్తున్న 1 ఎకరం 50 సెంట్ల పోడు భూమిలో సాటిలైట్ పాయింట్ మంజూరైందనే కారణంతో అధికారులు సాగు చేయకుండా అడ్డుకుంటున్నారని, ఆ భూమికి సంబంధించి సర్వే కూడా పూర్తయిందని పేర్కొంటూ వ్యవసాయం కొనసాగించేందుకు అనుమతి కల్పించాలని చేసిన వినతిని జిల్లా కలెక్టర్ పరిశీలించి, తగు చర్యల కోసం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారికి ఎండార్స్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో పాడి గేదె మృతి

- చర్లపల్లిలో విషాద ఘటన..
- అధికారులకు బాధితుడి ఫిర్యాదు

టీ మీడియా,జులై06,సింగరేణి(కారేపల్లి):

ఖమ్మం జిల్లా సింగరేణి మండలం చర్లపల్లి గ్రామంలో విద్యుద్ఘాతానికి గురై పాడి గేదె మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. బాధితుడు ఉన్నం నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పాడి గేదెలు మేతకు వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చాయి. అనంతరం వాటిని ఇంటి ఆవరణలో ఉన్న కోయ గుంజలకు కట్టారు. అయితే ఆ గుంజకు ఆనుకుని ఉన్న ఇనుప కడ్డీపై నుంచి ఇంటికి విద్యుత్ సరఫరా చేసే సర్వీస్ వైరు వెళ్లడంతో, విద్యుత్ లీకేజీ ఏర్పడింది. గేదెను ఆ ఇనుప కడ్డీకి ఆనుకుని ఉన్న గుంజకు కట్టడంతో విద్యుత్ ప్రవాహం గేదెకు తగిలి తీవ్ర విద్యుద్ఘాతానికి గురైంది. దీంతో పాడి గేదె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనపై బాధితుడు ఉన్నం నాగేశ్వరరావు విద్యుత్ శాఖ అధికారులకు, పశువైద్యశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఘటనపై అధికారులు విచారణ చేపట్టి, నష్టపరిహారం అందించి ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా విద్యుత్ లైన్లను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అప్రకటిత విద్యుత్ కోతలను వెంటనే నివారించాలి

- ప్రజావాణిలో సీపీఐ(ఎం) వినతిపత్రం

టీ మీడియా,జులై06,సింగరేణి(కారేపల్లి):

ఖమ్మం జిల్లా సింగరేణి మండలంలో కొనసాగుతున్న అప్రకటిత విద్యుత్ కోతలతో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే సమస్యను పరిష్కరించాలని సీపీఐ(ఎం) సింగరేణి మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు, కే. నరేంద్ర మాట్లాడుతూ.. అనావృష్టి కారణంగా రైతులు ఇప్పటికే ఇబ్బందులు పడుతున్నారని, విత్తనాలు వేసి వర్షాల కోసం ఎదురుచూస్తున్న సమయంలో పంటలను కాపాడేందుకు మోటార్లు నడపాలన్నా విద్యుత్ సరఫరా లేక తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. ఎండాకాలం ముగిసినా వర్షాకాలంలోనూ ఉక్కపోత తీవ్రంగా ఉందని, ఇంటి బయటకు వస్తే దోమల బెడద, కోతుల సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతుండగా, గంటల తరబడి విద్యుత్ నిలిచిపోవడంతో పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వం 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా అందిస్తున్నామని చెబుతున్నప్పటికీ, వాస్తవంగా ఉరుములు, మెరుపులు, గాలి లేదా చిరుజల్లులు పడినా వెంటనే విద్యుత్ నిలిపివేస్తున్నారని విమర్శించారు. తరచూ గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోతున్నా అధికారులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. సింగరేణి మండలంలో లైన్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉండటం, ఉన్న ఫోర్‌మెన్ వయోభారంతో విధులు నిర్వర్తించడం వల్ల విద్యుత్ సమస్యలు మరింత పెరుగుతున్నాయని, ఖాళీలను భర్తీ చేసి అప్రకటిత విద్యుత్ కోతలను వెంటనే నివారించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) వైరా డివిజన్ కమిటీ సభ్యులు వజ్జా రామారావు, మాజీ సర్పంచ్ బానోత్ బన్సీలాల్, నాయకులు తలారి దేవప్రకాశ్, ఆదెర్ల వినయ్‌కుమార్, చిలుముల భరత్, జి. నరేష్ పాల్గొన్నారు.

ఆఫీస్‌కు వచ్చేవారు మేము వచ్చిన సమయానికే రావాలి

- సమయపాలన పాటించని ఉద్యోగులు

టీ మీడియా జులై 06 కామేపల్లి :

మా రూటే సపరేట్... ఎవరు ఏమనుకుంటే మాకేంటి... మాకు నచ్చినపుడు విధులకు హాజరవుతాం... తమ కార్యాలయానికి పనిపై వచ్చేవారు మేము వచ్చేదాకా ఉండాల్సిందే... మమ్మల్ని ఎవరు ఏమి చేయలేరు... ఈ ఆఫీస్ కు కర్త, కర్మ, క్రియ అన్ని మేమే... ఇలా ఉంది వీరి వ్యవహారం...ఇది కామేపల్లి లోని ఉపాధి హామీ పథకం మండల కార్యాలయం ఉద్యోగుల పనితీరు సోమవారం ఉదయం 11 గంటల 20 నిమిషాలకు ఈ కార్యాలయంలో పనిచేసే కంప్యూటర్ ఆపరేటర్లు ఇతర సిబ్బంది అడ్రస్ కూడా లేరు. మండల కేంద్రంలో ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య కళ్యాణ లక్ష్మి, సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీకి వస్తున్న ఉపాధి హామీ పథకంలో పనిచేసే ఉద్యోగులు సమయానికి రావాలనే ఆలోచన కూడా లేదు. ఇక్కడ ఏపీఓ గా పనిచేస్తున్న శ్రీరాణి భర్త ఇటీవల చనిపోవడంతో ఆమె సెలవుల్లో ఉండటంతో ఈ కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది ఆడిందే ఆట పాడిందే పాటగా విధులకు నిర్లక్ష్యంగా హాజరవుతున్నారు. ఈ కార్యాలయానికి ఎప్పుడో ఉదయం పని మీద వచ్చిన వారు కళ్ళు కాయలు కాసేలా వీరి కోసం ఎదురుచూస్తూ కనిపించారు. 11 30 నిమిషాలకు ఈ కార్యాలయం లో పనిచేసే ఒక ఉద్యోగి మాత్రం ఆఫీస్ కి వచ్చారు. దీనిపై ఇంచార్జ్ ఎంపీడీవో వి వి ఎస్ శాస్త్రి ని వివరణ కోరగా తనకు విషయం దృష్టికి రాలేదని పరిశీలించి చర్యలు తీసుకుంటామని అన్నారు.

కారేపల్లిలో ఘనంగా శ్రీ పెద్దమ్మతల్లి వార్షిక బ్రహ్మోత్సవాలు

- మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన సర్పంచ్ మేదరి వీరప్రతాప్ (టోనీ)

టీ మీడియా,జులై 6,సింగరేణి(కారేపల్లి):

ఖమ్మం జిల్లా కారేపల్లిలోని పురాతన ప్రసిద్ధి గాంచిన శ్రీ పెద్దమ్మతల్లి ఆలయంలో సోమవారం వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల రెండో రోజు సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఆలయ అర్చకులు ముక్కామాల మల్లిఖార్జున శర్మ, సురేష్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించి, విశేష అలంకరణ చేశారు. అనంతరం గణపతి పూజ, మృత్యుంజయ హోమం, నవగ్రహ శాంతి పూజలు, కుంకుమార్చనలు వైదిక పద్ధతిలో నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు ఇమ్మడి తిరుపతిరావు దంపతులు, కారేపల్లి సర్పంచ్ మేదరి వీరప్రతాప్ (టోనీ) పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమాన్ని సర్పంచ్ మేదరి వీరప్రతాప్ (టోనీ) ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆధ్యాత్మిక వేడుకలు గ్రామ ప్రజల్లో ఐక్యత, భక్తి భావాన్ని పెంపొందిస్తాయని, ఇలాంటి కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ

ఎన్నెస్పి భూముల ఆక్రమణలను తొలగించండి

- కలెక్టరు సిపిఐ వినతి

టీ మీడియా,జూలై6,ఖమ్మం :
ఖమ్మం కార్పోరేషన్ 12వ డివిజన్లో కొందరు సంపన్నులు, వ్యాపారవేత్తలు, ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నెస్పి స్థలాలను –ఆక్రమించి స్థిర నివాసాలు ఏర్పాటు చేసి అద్దెలకు ఇస్తున్నారని దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం సిపిఐ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుగు గాంధీ మాట్లాడుతూ 12వ డివిజన్లో ఎన్నెస్పి కాలువలకు సంబంధించిన స్థలాలను ఆక్రమించుకుని దుకాణాలను ఏర్పాటు చేసి అద్దెలకు ఇస్తున్నారని తెలిపారు. గతంలో ఇదే ప్రాంతంలో పేదలు నివసిస్తుంటే న్యాయస్థానాల ద్వారా పేదలను వెళ్లగొట్టేందుకు ప్రయత్నం చేసిన వ్యక్తులే ఇప్పుడు ఆక్రమణలకు పాల్పడుతున్నారని గాంధీ తెలిపారు. కొందరైతే 58, 59 జీవోలను ఉపయోగించుకుని రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు దరఖాస్తు చేశారని వీటిని పరిశీలన చేసి –తిరస్కరించాలని కోరారు. ప్రభుత్వ స్థలంలో గ్రీన్ పార్కును ఏర్పాటు చేయాలని ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో ఆముదాల వెంకన్న, జాకీర్, అక్రం, సత్యనారాయణ, రమణ, స్వామి, వెంకట్, ముత్తయ్య, సైదులు, భాస్కర్, అజయ్ పాల్గొన్నారు.

తెలంగాణలో ఒకే రాష్ట్రం ఒకే పన్ను విధానం

(మొదటిపేజీ తరువాయి....)

పడుతుంది. ప్రస్తుతం రాష్ట్రం అంతటా తిరిగే బస్సులకు సీటుకి రూ.3,285 చొప్పున వసూలు చేస్తున్నారు. వీటికి మాత్రం పన్ను భారం భారీగా తగ్గి ఉపశమనం కలగనుంది. అయితే వీటి సంఖ్య దాదాపు 108 మాత్రమే.

ఇంకా నిర్ణయం తీసుకోలేదు :
ఒకే జిల్లా పరిధిలో తిరిగేవి ఏకంగా 5,100 బస్సు సర్వీసులు ఉన్నాయి. వీటికి త్రైమాసికానికి రూ.1,120 పన్ను ఉంది. అంటే ఒక జిల్లా పరిధిలో తిరిగినా, రాష్ట్రం అంతా తిరిగినా ఒకే రకమైన ట్యాక్స్ కట్టాల్సి ఉంటుంది. దీంతో తక్కువ దూరం తిరిగే బస్సుల యజమానులకు కొత్త విధానం గుదిబండగా మారే అవకాశం ఉంది. ఇప్పటివరకైతే అధ్యయనం మాత్రమే జరుగుతోందని ఈ కొత్త విధానంపై ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని రవాణాశాఖ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. నిర్ణయం తీసుకుంటే బస్సుల యజమానుల నుంచి తప్పకుండా అభిప్రాయాలు స్వీకరిస్తామని అధికారులు అంటున్నారు. కొత్త విధానంలో రాష్ట్రం పర్మిట్‌తో పాటు ఉమ్మడి జిల్లా పర్మిట్ ఆలోచన కూడా ఉందని చెబుతున్నారు.

మ్యాక్సీ క్యాబ్‌లకు
8 నుంచి 17 సీట్ల వరకు ఉండే మ్యాక్సీ క్యాబ్‌లు, వ్యాన్లు ప్రతి మూడు నెలలకోసారి తప్పనిసరిగా ట్యాక్స్ కట్టాలి. మహారాష్ట్ర, కర్ణాటకల్లో ఒకేసారి లైఫ్‌ట్యాక్స్ కడితే సరిపోతుంది. ఆ వెసులుబాటు అక్కడే ఉంది. దీంతో అక్కడ ఈ వాహనాల సంఖ్య ఎక్కువని రవాణా శాఖ అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ మ్యాక్సీ క్యాబ్‌లు, వ్యాన్ల యజమానులకు వెహికల్ ట్యాక్స్? త్రైమాసికం లేదా లైఫ్‌ట్యాక్స్ రెండు రకాల ఆప్షన్లు ఇవ్వాలని సూత్రప్రాయ నిర్ణయం తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.

కారేపల్లిలో ఘనంగా శ్రీ పెద్దమ్మతల్లి వార్షిక బ్రహ్మోత్సవాలు

- మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన సర్పంచ్ మేదరి వీరప్రతాప్ (టోనీ)

టీ మీడియా,జూలై 6,సింగరేణి(కారేపల్లి):
ఖమ్మం జిల్లా కారేపల్లిలోని పురాతన ప్రసిద్ధి గాంచిన శ్రీ పెద్దమ్మతల్లి ఆలయంలో సోమవారం వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో,వైభవంగా నిర్వహించారు.బ్రహ్మోత్సవాల రెండో రోజు సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు,అభిషేకాలు,కుంకుమార్చనలు నిర్వహించగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.ఆలయ అర్చకులు ముక్కామాల మల్లిఖార్జున శర్మ,సురేష్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించి,విశేష అలంకరణ చేశారు.అనంతరం గణపతి పూజ,మృత్యుంజయ హోమం,నవగ్రహ శాంతి పూజలు,కుంకుమార్చనలు వైదిక పద్ధతిలో నిర్వహించారు.ఈ పూజా కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు ఇమ్మడి తిరుపతిరావు దంపతులు,కారేపల్లి సర్పంచ్ మేదరి వీరప్రతాప్ (టోనీ) పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమాన్ని సర్పంచ్ మేదరి వీరప్రతాప్ (టోనీ) ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ఆధ్యాత్మిక వేడుకలు గ్రామ ప్రజల్లో ఐక్యత,భక్తి భావాన్ని పెంపొందిస్తాయని,ఇలాంటి కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తురక నారాయణ,పెర్ని వెంకటేశ్వర్లు,పొలగాని శ్రీనివాసరావు,పెద్దమ్మ సత్యనారాయణ,తురక రాంబాబు,పానిన్ని నాగేశ్వరరావు,పోతు రాములు,ఓరుగంటి రంగనాథ్,ఎనిక రవి,చింతల సంపత్,యర్ర మాధవ్,తురక రవి,మల్లేష్,ముక్కా సీతారాములు,యవగందుల మధు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో పేలిన రైస్ కుక్కర్

టీ మీడియా,జూలై6,నాగర్ కర్నూలు :
నాగర్ కర్నూలు జిల్లా కొల్లాపూర్ పట్టణం పదో వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో రైస్ కుక్కర్ పేలి చిన్నారులకు గాయాలయ్యాయి. గాయపడ్డ చిన్నారులను వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రైస్ కుక్కర్‌లో వండిన తరువాత ఆయా దానిని చిన్నారుల ఎదుటే తీయడంతో ఒక్కసారిగా పేలింది. దీంతో అక్కడే ఉన్న చిన్నారులు గాయపడ్డారు.వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా సూపరింటెండెంట్ శ్రీనివాస్, చిన్నపిల్లల డాక్టర్ యాదగిరి బిల్లా గాయపడ్డ చిన్నారులకు వైద్యం అందించారు. విషయం తెలుసుకున్న సీడీపీవో మహేశ్వరి అక్కడికి చేరుకొని వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిర్లక్ష్యం వహించిన ఆయాపై తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. వార్డు కౌన్సిలర్ బోరెల్లి మహేష్ వెంటనే ఆసుపత్రికి వెళ్లి చిన్నారులను పరామర్శించారు

ముఖ్యమంత్రి సభకు జిల్లా యంత్రాంగం సన్నద్ధం

- దిశానిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్

టీ మీడియా,జూలై6,చింతకాని :
జిల్లాలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ముఖ్యమంత్రి పర్యటన కోసం అన్ని శాఖలు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు.ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని చింతకాని మండలం జగన్నాథపురం(మత్కెపల్లి) వద్ద నిర్వహించనున్న బహిరంగ సభ కు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్న నేపథ్యంలో సభ ఏర్పాట్లను సోమవారం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లా కలెక్టర్, పోలీసు కమిషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి లతో కలిసి సభా ప్రాంగణం, హెలిప్యాడ్, వాహన పార్కింగ్ ప్రాంతాలు, ప్రజల రాకపోకలకు అనువైన మార్గాలు, భద్రతా ఏర్పాట్లను సమగ్రంగా పర్యవేక్షించి, ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం కోసం పకడ్బంది చర్యలపై వివిధ శాఖల అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూలి జూన్ 30న భారీ బహిరంగ సభ నిర్వహించి రైతు భరోసా కార్యక్రమాన్ని ప్రారంభించాలని నిర్ణయించినప్పటికీ, అప్పటి భారీ వర్షాలు, వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో కార్యక్రమాన్ని వాయిదా వేయాల్సి వచ్చిందని కలెక్టర్ గుర్తుచేశారు. ఉప ముఖ్యమంత్రి సమక్షంలో జరిగిన సమీక్షలో కూడా వాతావరణ పరిస్థితులు అనుకూలించిన తర్వాత కొత్త తేదీని నిర్ణయిస్తామని వెల్లడించినట్లు తెలిపారు.వాతావరణ శాఖ జూలై 6వ తేదీ వరకు భారీ వర్షాల సూచనలు ఇచ్చిన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండి పరిస్థితులను నిరంతరం పరిశీలించిందన్నారు. అయితే ఊహించినంతగా వర్షాలు నమోదు కాకపోవడంతో సభ నిర్వహించాల్సిన ప్రాంగణాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి గ్రౌండ్ పరిస్థితులను అంచనా వేస్తున్నామని

అన్నారు.ప్రస్తుతం సభా ప్రాంగణం దాదాపు పూర్తిగా ఎండిపోయి కార్యక్రమం నిర్వహించేందుకు అనుకూలంగా ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించామని తెలిపారు. ఈ మేరకు జిల్లా యంత్రాంగం చేసిన ఏర్పాట్లు, ప్రాంగణ పరిస్థితులు, ఇతర అంశాలపై వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి, ముఖ్యమంత్రి కార్యాలయానికి నివేదిక అందజేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు.ముఖ్యమంత్రి కార్యక్రమానికి సంబంధించిన తేదీని ప్రభుత్వం త్వరలో అధికారికంగా ఖరారు చేస్తుందని, తేదీ నిర్ణయమైన వెంటనే ప్రజలకు అధికారిక సమాచారం అందజేస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు. అప్పటివరకు అన్ని శాఖలు పూర్తి సన్నద్ధతతో ఉండి అవసరమైన ఏర్పాట్లను సిద్ధంగా ఉంచాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.సభకు భారీ సంఖ్యలో రైతులు, ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున అన్ని ఏర్పాట్లను ముందస్తుగా ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని మిగిలిన పనులు సభా వేదిక నిర్మాణం, హెలిప్యాడ్ ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్, ప్రజల కూర్చునే ఏర్పాట్లు, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే వ్యవస్థలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన అన్ని ప్రోటోకాల్ ఏర్పాట్లు నిబంధనలకు అనుగుణంగా ఉండేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. అలాగే సభకు హాజరయ్యే రైతులు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీటి సౌకర్యం, నిరంతర విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, తాత్కాలిక మరుగుదొడ్లు, వైద్య శిబిరాలు, అంబులెన్స్ సేవలు, అగ్నిమాపక ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు, భద్రతా బందోబస్తు వంటి అంశాలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్, రెవెన్యూ, పోలీసు, విద్యుత్, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నో డంపింగ్ యార్డులు

- రూ.529 కోట్లతో వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రాలు

టి మీడియా, జూలై 6, అమరావతి బ్యూరో:
రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత దిశగా అడుగులు పడుతున్నాయి. డంపింగ్ యార్డు రహితంగా నగరాలు, పట్టణాలను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ముందడుగు వేస్తోంది. ఇళ్లు, దుకాణాల్లో సేకరించిన వ్యర్థాలను ఇకపై ఎక్కడపడితే అక్కడ పారేయరు. వాటిని నేరుగా ఆధునిక ప్రాసెసింగ్ కేంద్రాలకు తరలించేలా నూతన విధానాన్ని అమలు చేయనున్నారు.

డిసెంబరు నాటికి 107 కేంద్రాలు
పట్టణాల్లో చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా రాష్ట్రవ్యాప్తంగా 107 'ఫ్రెష్ వేస్ట్ ప్రాసెసింగ్ కేంద్రాల'ను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. వీటిలో 20 కేంద్రాలు ఈ

నెలాఖరులోగా ప్రారంభం కానున్నాయి. మిగతా కేంద్రాలను ఈ ఏడాది డిసెంబరు నెలాఖరు నాటికి పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురానున్నారు. రోజూ సుమారు 5,300 టన్నుల వ్యర్థాలను ప్రాసెస్ చేసే సామర్థ్యంతో ఈ కేంద్రాలను నిర్మిస్తున్నారు. వీటి ఏర్పాటుకు ప్రభుత్వం రూ.529 కోట్లు ఖర్చు చేస్తోంది. వ్యర్థాల నుంచి విద్యుత్‌ను ఉత్పత్తి చేసే మరో ఆరు ప్లాంట్లను కూడా ప్రైవేట్ సంస్థల ఆధ్వర్యంలో ప్రారంభించేలా అధికారులు వేగంగా చర్యలు తీసుకుంటున్నారు.

తడి చెత్త నుంచి సేంద్రియ ఎరువులు
కొత్తగా ఏర్పాటయ్యే ప్రాసెసింగ్ కేంద్రాల్లో తడి చెత్త నుంచి సేంద్రియ ఎరువులు తయారు చేస్తారు. ఏటా 3 లక్షల టన్నుల ఎరువును ఉత్పత్తి చేయాలన్నది ప్రభుత్వ ప్రణాళిక. ఇలా తయారైన ఎరువులను మార్క్‌ఫెడ్‌కు సరఫరా చేస్తారు. ఇందుకు సంబంధించి స్వచ్ఛాంధ్ర సంస్థ ఇటీవల మార్క్ ఫెడ్ తో ఒక ఒప్పందం కూడా కుదుర్చుకుంది.

పొడి చెత్త పునర్వినియోగం :
రోజూ సుమారు 2,434 టన్నుల పొడి చెత్త ఈ ప్రాసెసింగ్ కేంద్రాలకు రానుంది. ప్లాస్టిక్ వస్తువులు, ఇ–వేస్ట్ తదితర పొడి చెత్తను పునర్వినియోగం (రీసైక్లింగ్) కోసం పలు సంస్థలకు సరఫరా చేస్తారు. తడి, పొడి వ్యర్థాలను ప్రాసెస్ చేయగా మిగిలిన జడ వ్యర్థాలకు కూడా శాస్త్రీయ పరిష్కారం చూపుతారు. మట్టి, ఇటుక, కాంక్రీట్, టైల్స్ ముక్కల వంటి వ్యర్థాలను శాస్త్రీయ విధానంలో భూమిలో కలిసేలా ఏర్పాట్లు చేస్తారు. ప్రాసెస్ కేంద్రాల్లో వ్యర్థాల నుంచి తయారుచేసే ఇంధనాన్ని (ఆర్‌డీఎఫ్) నేరుగా సిమెంట్ ఫ్యాక్టరీలకు తరలిస్తారు.

ఆరు నగరాల్లో విద్యుత్ ప్లాంట్లు
ఈ ఫ్రెష్ వేస్ట్ కేంద్రాల నిర్వహణ బాధ్యతను ఆయా పుర, నగరపాలక సంస్థలు తీసుకుంటాయి. ఇందుకు గాను టన్ను చెత్తకు రూ.550 చొప్పున స్థానిక సంస్థలు చెల్లించాల్సి ఉంటుంది. ప్లాంట్ల ఏర్పాటుకు అయ్యే నిధులను స్వచ్ఛాంధ్ర సంస్థ సమకూర్చుతోంది. కడప, కర్నూలు, నెల్లూరు, కాకినాడ, తిరుపతి, విజయవాడల్లో ఈ ఆరు విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లను ప్రైవేట్ సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్నారు. వీటిలో నాలుగు చోట్ల ప్లాంట్ల ఏర్పాటుకు ప్రైవేట్ సంస్థల నుంచి స్వచ్ఛాంధ్ర సంస్థ ఇప్పటికే ఆహ్వానాలు కోరింది.

భూమి లేదు.. రికార్డుల్లో పట్టా ఐంది..!

టీ మీడియా, జులై6,పెద్దపల్లి ప్రతినిధి:
పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండల కేంద్ర గ్రామ శివారులోని సర్వే నంబర్ 226లో వాస్తవంగా మిగులు భూమి లేనప్పటికీ, 18 గుంటల భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసి పట్టాదారు పాస్‌బుక్‌లో నమోదు చేయడం ద్వారా ప్రభుత్వానికి, స్థానిక రైతులకు నష్టం కలిగించారని రైతు నాయకులు ఆరోపించారు. ఈ అక్రమ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులైన అధికారులు, సంబంధిత వ్యక్తులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు జిల్లా కలెక్టర్‌ను డిమాండ్ చేశారు.పెద్దపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైతు నాయకులు సింగిరెడ్డి రామచంద్రారెడ్డి, కోటిచింతల మురళీధర్ రావు, తాటికొండ అనిల్, భీం సేన్ గొడిసేలా తదితరులు మాట్లాడారు.రైతుల కథనం ప్రకారం.. సర్వే నంబర్ 226లో మొత్తం 11 ఎకరాల 20 గుంటల భూమి ఉంది. అందులో 2 ఎకరాల 10 గుంటల భూమిని ఎస్సార్ఎస్పీ కాలువ, ఆర్‌అండ్‌బీ రహదారి నిర్మాణం కోసం ప్రభుత్వం గతంలోనే స్వాధీనం చేసుకుంది. మిగిలిన 9 ఎకరాల 10 గుంటల భూమి ప్రస్తుతం సింగిరెడ్డి కుటుంబం ఆధీనంలో ఉంది. అక్కడ ఎలాంటి అదనపు

లేదా మిగులు భూమి లేదని వారు స్పష్టం చేశారు.కానీ, 2012లో క్షేత్రస్థాయిలో (మోకా మీద) ఎలాంటి భూమి లేకున్నా.. 18 గుంటల భూమిని మూసాల యుగంధర్ రెడ్డి పేరిట అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపించారు. ఆ తర్వాత 2015లో అదే భూమిని ముంజంపల్లి లింగమూర్తి పేరిట తిరిగి రిజిస్ట్రేషన్ చేసి, రికార్డుల్లో పట్టాదారు పాస్‌బుక్‌లో కూడా నమోదు చేశారని పేర్కొన్నారు.

కలెక్టర్ తొలగించినా.. మళ్లీ పునరుద్ధరణ?
సమాచార హక్కు చట్టం ద్వారా సేకరించిన వివరాలు, అలాగే స్థానిక తహసీల్దార్ సమర్పించిన నివేదికలో సదరు సర్వే నంబర్‌లో ఎలాంటి మిగులు భూమి లేదని స్పష్టంగా ఉందని రైతులు తెలిపారు. ఈ ఆధారాలతో 2025 మే 13న జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, విచారించిన అధికారులు ఆ 18 గుంటల అక్రమ నమోదును రికార్డుల నుండి తొలగించారని గుర్తు చేశారు. అయితే, ఆ తర్వాత ల్యాండ్ సర్వే అధికారుల నివేదికను ఆసరాగా చేసుకొని, అదే అక్రమ నమోదును మళ్లీ పునరుద్ధరించడం వెనుక పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు.ఈ భూ అక్రమాలపై జిల్లా కలెక్టర్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, రాష్ట్రపతి, గవర్నర్, ముఖ్యమంత్రి కార్యాలయాలకు ఫిర్యాదులు చేసినట్లు రైతులు తెలిపారు. ఈ నేపథ్యంలో విజిలెన్స్ ఆదేశాల మేరకు ఇటీవల జిల్లా రెవెన్యూ, సర్వే, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, మరోసారి సర్వే నిర్వహించినట్లు వెల్లడించారు.లేని భూమిని రికార్డుల్లో సృష్టించి ప్రభుత్వానికి నష్టం కలిగించేలా వ్యవహరించిన వ్యక్తులపై, వారికి సహకరించిన అధికారులపై నిష్పాక్షిక విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అలాగే సర్వే నంబర్ 226లోని 18 గుంటల అక్రమ నమోదును రికార్డుల నుండి శాశ్వతంగా తొలగించాలని రైతు నాయకులు డిమాండ్ చేశారు.

300 కోట్ల అక్రమాస్తులు..

- డీఎస్పీ భీమ్‌రెడ్డి అరెస్ట్

టీ మీడియా,జూలై6,హైదరాబాద్ బ్యూరో :
ఆదాయానికి మించిన ఆస్తులు కలిగిన డీఎస్పీ భీమ్‌రెడ్డిని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు అరెస్ట్ చేశారు. రూ.300 కోట్ల అక్రమాస్తులు కేసులో సోమవారం ఏసీబీ బృందం భీమ్‌రెడ్డిని అదుపులోకి తీసుకుంది. 'డీఎస్పీ భీమ్‌రెడ్డి అరెస్టు ఎప్పుడో.. అరెస్టు కాకుండా అడ్డుకున్న 'అదృశ్య శక్తి' ఎవరు?' అని నమస్తే తెలంగాణలో కథనం ప్రచురించిన రెండు రోజులకే స్పందించిన ఏసీబీ అధికారులు ఎట్టకేలకు ఆయనను అరెస్ట్ చేశారు.ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయనే ఆరోపణల నేపథ్యంలో డీఎస్పీ భీమ్‌రెడ్డిపే కేసు నమోదైంది. కేసు దర్యాప్తులో భాగంగా నాలుగు రోజుల క్రితం భీమ్‌రెడ్డికి చెందిన నివాసాలు, కార్యాలయాలు,

ఇతర అనుబంధ ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు విస్తృత సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సుమారు రూ.300 కోట్ల విలువైన ఆదాయానికి మించిన అక్రమాస్తులను గుర్తించినట్లు ఏసీబీ వెల్లడించింది. సోదాల్లో లభించిన ఆధారాలు, పత్రాల పరిశీలన అనంతరం భీమ్‌రెడ్డిని అధికారులు అరెస్ట్ చేసినట్లు సమాచారం. కేసుకు సంబంధించిన మరిన్ని వివరాలను ఏసీబీ త్వరలో అధికారికంగా వెల్లడించే అవకాశం ఉంది.

అతిపెద్ద అవినీతి
రాష్ట్ర పోలీస్‌శాఖలో భారీ అవినీతి తిమింగలంగా భావిస్తున్న డీఎస్పీ భీమ్‌రెడ్డిని ఏసీబీ చరిత్రలోనే అతిపెద్ద అవినీతి తిమింగలంగా భావిస్తున్నారు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లోని 16 ప్రాంతాల్లో ఏకకాలంలో జరిగిన ఈ దాడుల్లో రూ.200 కోట్ల నుంచి 300 కోట్ల విలువైన అక్రమాస్తులు వెలుగుచూశాయి.

ఏజెన్సీలో మెడికల్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

- మచ్చా వెంకటేశ్వర్లు

టీ మీడియా,జూలై6,బూర్గంపహాడ్ :
ఏజెన్సీ ప్రాంతంలో మెడికల్ ఎమర్జెన్సీని ప్రకటించాలని, బూర్గంపహాడ్ మండల ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు అందని ద్రాక్షగా మారాయని సీపీఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం బూర్గంపహాడ్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ని సీపీఎం నాయకులతో కలిసి సందర్శించారు. ఆస్పత్రిలో రోగుల వార్డుకు వెళ్లి అందుతున్న వైద్య సేవలు, వైద్యపరంగా ఎదుర్కొంటున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆస్పత్రి సమస్యలకు నిలయంగా మారిందని, 30 పడకల ఆస్పత్రి నూతనంగా నిర్మిస్తామని చెప్పి ఏడాది గడుస్తున్నా

నేటికీ అతీగతి లేదని, డిప్యూటేషన్‌పై వచ్చిన వైద్యులతో వైద్యం అందించడం విచారకరమన్నారు. రెగ్యులర్ వైద్యులు, సిబ్బందిని తక్షణమే నియమించాలని, నూతన ఆస్పత్రి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు.వర్షాకాలం నేపథ్యంలో గోదావరి వరద ముంపు పొంచి ఉన్నందున ఆస్పత్రి చుట్టూ ప్రహరీని నిర్మించాలని, ఆస్పత్రిలో ఎక్స్‌రే, స్కానింగ్ విభాగాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ ముక్కంటి వెంకటేశ్వరరావును కలిసి సమస్యలను తక్షణమే పరిష్కరించేలా ప్రభుత్వానికి నివేదించాలని, నూతన ఆస్పత్రి భవన నిర్మాణం త్వరితగతిన పూర్తిచేసి రోగులకు అందుబాటులోకి తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రేపాకుల శ్రీనివాస్, మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు, పాండవుల రామనాథం, రాయల వెంకటేశ్వర్లు, వై.అప్పారావు పాల్గొన్నారు.

గిరిజన రైతులపై కేసులు సరికాదు

- మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వర్‌రావు

టీ మీడియా,జూలై6,దమ్మపేట:
దమ్మపేట మండలంలోని నల్లకుంటలో బడుగు, బలహీన, గిరిజన రైతులు బొగ్గం శివ, మల్లా కమల, గోళ్ల సీతారావమ్మ, గోళ్ల వెంకటేశ్వర్లు, గట్ల సర్వేశ్వరరావు, జంగాల వెంకటేశ్వరరావుకు చెందిన 273/1 సర్వే నెంబర్ల భూముల్లో ఆదివారం అర్ధరాత్రి కొందరు దుండగులు చొరబడి కొబ్బరి మొక్కలను అత్యంత దారుణంగా నరికివేశారు. విషయం తెలుసుకున్న అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఇన్‌చార్జి మెచ్చా నాగేశ్వరరావు సోమవారం ఘటనా స్థలానికి చేరుకుని ధ్వంసమైన కొబ్బరి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా బాధిత రైతులతో మాట్లాడి వారి ఆవేదనను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూ వివాదాలు ఏమైనా ఉంటే చట్టపరంగా, కోర్టుల ద్వారా పరిష్కరించుకోవాలే తప్ప, ఇలా చీకటి మాటున అర్ధరాత్రి పూట రైతుల పంటను ధ్వంసం చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అన్నారు. బడుగు, బలహీన, గిరిజన రైతులను బెదిరింపులకు గురిచేయడం, వారిపై అక్రమ కేసులు బనాయించడం ఏమాత్రం సరికాదన్నారు. రైతులకు అండగా ఉంటామని ఆయన స్పష్టం చేశారు. సంబంధిత అధికారులు తక్షణమే ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, రికార్డుల ప్రకారం అసలైన రైతులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులను ఎవరైనా ఇబ్బంది పెడితే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ దారా యుగంధర్, అబ్దుల్ జిన్నా, గాజుబోయిన ఏసుబాబు, పాశం ప్రసాద్, వెలుగోటి మహేష్, సందీప్ తదితర నాయకులు పాల్గొన్నారు.

8వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు

టీ మీడియా,జూలై6,సత్తుపల్లి:
కోల్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ సింగరేణి శాఖ, సత్తుపల్లి ఏరియా ఆధ్వర్యంలో సింగరేణి అధికారులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 8వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షకులకు సిఐటియు వ్యవసాయ కార్మిక సంఘాలు మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమం సందర్భంగా సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు చలమాల విటల్ రావు, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కోలిక పోగు సర్వేశ్వరరావు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు జాజిరి శ్రీనివాసరావు. సిఐటి నాయకులు చెరుకు శ్రీనివాసరావు పాల్గొని వారు చేస్తున్న సమ్మెకు సంపూర్ణ మద్దతును తెలియజేశారు. ఈ రోజు జరిగిన దీక్షలో డీజీఎం (ఈ అండ్ ఎం) కిష్టారం ఓసీపీకి చెందిన జి.వి. రావు, ఈఈ (ఈ అండ్ ఎం) జేవీఆ